

గోవాడ రైతులకు నేటి నుంచి చెల్లింపులు

» టన్నుకు రూ.3 వేల చొప్పున ఖాతాల్లో జమ

చోడవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సభ్య రైతులకు ఈ నెల 27వ తేదీ నుంచి చెరకు డబ్బులు చెల్లించనున్నట్టు ఎండీ వి.సన్యాసినాయుడు బుధవారం ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 21వ తేదీ నుంచి ఫిబ్రవరి నాలుగో తేదీ వరకు సుమారు 20 వేల టన్నుల చెరకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు రూ.3 వేల చొప్పున ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. ఇందుకోసం రూ.5.84 కోట్లు విడుదల చేసినట్టు పేర్కొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా...

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

» ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ
» రాంబిల్లి మండలంలో ఫేజ్-2 కింద 2,500 ఎకరాల్లో మినీ పారిశ్రామిక హబ్
» రానున్న ఆర్థిక సంవత్సరంలో 46 శాతం వృద్ధి లక్ష్యం


అనకాపల్లి మండలం కోడూరులో ఎంఎస్ఎంఈ ఏర్పాటుకు ఏపీఐఐసీ సేకరించిన భూమి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)
వ్యవసాయ అధారిత జిల్లాగా పేరున్న అనకాపల్లి జిల్లా భవిష్యత్తులో పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందనున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ 2025-26లో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యాలు, ప్రణాళికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వచ్చే ఏడాది జిల్లాలో పారిశ్రామిక వృద్ధి 46 శాతం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు

జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) లను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం ... మిగతా 8వ పేజీలో

మూడు క్లస్టర్లుగా జిల్లా

మొదటి క్లస్టర్‌లో ఆరు మండలాలతో పారిశ్రామిక జోన్

» రెండో క్లస్టర్‌లో గిరిజన, అటవీ ప్రాంత మండలాలు
» మూడో క్లస్టర్‌లో వ్యవసాయ ఆధారిత మండలాలు
» వ్యవసాయ రంగంలో 39 శాతం వృద్ధి లక్ష్యం
» అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధే ధ్యేయం
» కలెక్టర్ల సదస్సులో విజయకృష్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన సదస్సులో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాను భౌగోళికంగా మూడు క్లస్టర్లుగా విభజించి అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలను రూపొందించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో రెండో రోజైన బుధవారం ఆమె 2025-26లో జిల్లా అభివృద్ధి ప్రణాళిక (విజన్ డాక్యుమెంట్‌ను) పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. మొదటి క్లస్టర్ కింద జిల్లాలో ఆరు మండలాలను పారిశ్రామిక జోన్‌గా పరిగణించి కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గిరిజనులు, అడవులు అధికంగా వున్న ఎనిమిది మండలాలను రెండో క్లస్టర్‌గా, పూర్తిగా వ్యవసాయ ఆధారితంగా వున్న ఎనిమిది మండలాలను మూడో క్లస్టర్‌లో చేర్చినట్టు కలెక్టర్ వివరించారు.

తలసరి ఆదాయం మైదాన ప్రాంత మండలాల్లో సంతృప్తికరంగా వుండగా, గిరిజన ప్రాంతాల్లో తక్కువ వుందని కలెక్టర్ విజయకృష్ణన్ గణాంకాలతో వివరించారు. ఈ ఏడాది వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 24 శాతం వృద్ధి నమోదైందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 39 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేయనున్నామని పేర్కొన్నారు. సేవా రంగంలో 23.51 శాతం వృద్ధి నమోదైందని, దీనిని 24.51 శాతానికి పెంచాలని ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది పారిశ్రామిక రంగంలో 52 శాతం వృద్ధి నమోదైందని, రానున్న ఏడాదిలో పారిశ్రామిక రంగ వృద్ధి 46 శాతం లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్ల సదస్సులో ఎన్ఏఓబీ బాధితుల సమస్య

» మత్స్యకారుల ఇబ్బందులను ప్రస్తావించిన మంత్రి నారా లోకేశ్
» పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఆదేశం

అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): **రాంబిల్లి మండలంలోని నేవల్ అల్టర్‌నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఓబీ) పరిధిలో మత్స్యకారుల సమస్యపై అమరావతిలో బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో చర్చ జరిగింది. మత్స్యకారుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. వివరాల్లోకి వెళితే..**

తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నారా లోకేశ్ 2023లో యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాంబిల్లి మండలంలో మత్స్యకారులు ఆయనను కలిసి ఎన్ఏఓబీ కారణంగా తాము ... మిగతా 8వ పేజీలో


మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లడానికి వీలుకాకుండా శారదా నదిలో అడ్డంగా నిర్మించిన వంతెన, దిగువన ఏర్పాటు చేసిన మెష్ (ఫైల్ ఫొటో)

నూకాంబిక జాతరకు భారీగా ఏర్పాట్లు

రాష్ట్ర స్థాయి పండుగగా ప్రకటించడంతో ఎన్టీఆర్ స్టేడియంలో పలు కార్యక్రమాలు

» ప్రత్యేక ఆకర్షణగా 12 అడుగుల అమ్మవారి ఉత్సవ విగ్రహం
» చేతివృత్తులు, హస్తకళల స్టాల్స్ ఏర్పాటు
» రోజూ పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు


ఎన్టీఆర్ స్టేడియం ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన రాజగోపురం సెట్టింగ్

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ప్రభుత్వం రాష్ట్రస్థాయి పండుగగా ప్రకటించడంతో అధికారులు ఆ మేరకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, చేతివృత్తుల స్టాళ్లు వంటివి ఏర్పాటు చేయడానికి ఆలయం వద్ద తగినంత స్థలం లేకపోవడంతో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు. మరో రెండు రోజుల్లో కొత్త అమావాస్య జాతర ప్రారంభం కానుండడంతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనల మేరకు ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లు మొదలుపెట్టారు. స్టేడియం ప్రవేశ మార్గం వద్ద రాజగోపురం సెట్టింగ్ వేశారు. పెవిలియన్ భవనం వద్ద భారీ స్టేజీని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ నూకాంబిక అమ్మవారి 12 అడుగుల ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. వేదికపై నెల రోజులపాటు ప్రతి రోజూ కోలాటాలు, జానపద నృత్యాలు, సంకీర్తనలు, భరతనాట్యం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి కళాకారులను రప్పిస్తున్నారు. స్టేడియంలో చేతివృత్తులు, హస్త కళలు, పిల్లల ఆటవస్తువులు, తదితర వాటి ప్రదర్శన/ అమ్మకాల ... మిగతా 8వ పేజీలో


స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, బారికేడ్లు

ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

19 మంది కౌన్సిలర్ల సంతకాలతో కమిషనర్‌కు నోటీసు

» రమాకుమారి వైసీపీని వీడడంతో పదవి నుంచి దించేయాలని అధిష్ఠానం ఆదేశాలు


మునిసిపల్ కమిషనర్‌కు నోటీసు అందజేస్తున్న వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు


పిల్లా రమాకుమారి, చైర్‌పర్సన్ (ఫైల్‌ఫొటో)

ఎలమంచిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): **ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమాపై మెజారిటీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన నోటీసును బుధవారం మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు అందజేశారు.**

ఎలమంచిలి మునిసిపల్ పాలకవర్గానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 25 వార్డులకుగాను 23 వార్డులో వైసీపీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఒక వార్డులో టీడీపీ, మరో వార్డులో ఇండిపెండెంట్ గెలిచారు. 5వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన పిల్లా రమాకుమారి చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కాగా రమాకుమారి ఇటీవల వైసీపీని వీడి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. చైర్మన్ ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తికావడం, రమాకుమారి వైసీపీని వీడడంతో ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించేయాలని వైసీపీ పెద్దలు భావించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం సమావేశం నిర్వహించారు. వైసీపీకి చెందిన మునిసిపల్ వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీ బోదెపు గోవింద్, తదితరులు హాజరయ్యారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పార్టీ మారిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించి, అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆమెను పదవి నుంచి దించేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. అనంతరం వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు నాగ త్రినాథ గుప్తాలతో కలిసిన మొత్తం 19 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన పత్రంపై సంతకాలు చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు, మునిసిపల్ కమిషనర్‌కు నోటీసులు అందించారు.

పేదల కాలనీలో పెద్దోళ్లకు ఇళ్లు!

జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో అడ్డగోలుగా కేటాయింపులు

» ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సైనికులకు మంజూరు
» వైసీపీ నేత ప్రోద్బలంతోనే...
» స్థానికులు ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోని వైనం
» తాజాగా విచారణ
» మొత్తం 134 మందిలో 60 మంది అనర్హులు ఉన్నట్టు గుర్తింపు


జెర్రిపోతులపాలెంలో బలహీన వర్గాలకు నిర్మించిన కాలనీ

విశాఖపట్నం, పెందుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): **పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సైనికులకు అడ్డగోలుగా ఇళ్లు మంజూరుచేసిన విషయం వెలుగులోకి వచ్చింది. రెండస్తుల ఇళ్లు, కార్లు ఉన్నవారికి కూడా గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు కేటాయించేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ప్రస్తుతం రీవెరిఫికేషన్ చేయించగా 60 మంది అనర్హులు ఉన్నట్టు తేలింది. వివరాల్లోకి వెళితే...**

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు జెర్రిపోతులపాలెంలో 1.5 సెంట్లు చొప్పున 134 మందికి ప్లాట్లు సిద్ధం చేశారు. హౌసింగ్ స్కీమ్‌కు నాలుగు చక్రాల వాహనం కలిగినవారు, గ్రామీణ ప్రాంతంలో సొంత ఇల్లు ఉన్నవారు, కరెంట్ నెలకు 300 యూనిట్లు మించి వినియోగించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు/పింఛన్‌దారులు అనర్హులు. అయితే అప్పటి అధికారులు నిబంధనలేవీ పాటించకుండా గ్రామంలో వైసీపీ నేత ఒకరి ప్రోద్బలంతో 134 మందితో జాబితాను ఆమోదించి గృహ నిర్మాణ సంస్థకు పంపారు. గ్రామానికి ఆనుకుని లేఅవుట్ వేశారు. ఇళ్లు మంజూరైన వారిలో నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులు, సైనికులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైరై పింఛన్ తీసుకుంటున్నవారు ఉన్నారు. అందరూ భార్య పేరిట ఇల్లు తీసుకున్నారు. అనర్హులకు ఇళ్లు మంజూరుచేయడంపై అప్పట్లో గ్రామానికి చెందిన పలువురు అభ్యంతరం వ్యక్తంచేశారు. చివరకు గ్రామ సర్పంచ్ మడక అప్పలరాజు స్వయంగా పెందుర్తి తహసీల్దార్, హౌసింగ్ అధికారులను, కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

ఇదిలావుండగా లేఅవుట్‌లో అధికారికంగా 134 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా అధికార పార్టీ దన్ను ... మిగతా 8వ పేజీలో

గర్శింగిలో ప్రభుత్వ భూమి కబ్జా

జిరాయితీ పక్కన కొండవాలు ప్రదేశం ఆక్రమణ

» మట్టి, రాళ్లు తొలగించి వెంచర్‌లో కలిపేసుకున్న అక్రమార్కులు
» స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది సహకారం


కొండపోరంబోకు భూమిని ఆక్రమించి వేసిన లేఅవుట్

దేవరాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్శింగిలో జిరాయితీ భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్న బడాబాబులు.. పక్కనే వున్న ప్రభుత్వ భూములను ఆక్రమించి లేఅవుట్‌లో కలిపేసుకుంటున్నారు. వీరికి స్థానిక నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గర్శింగి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు(ఎల్.పి.ఎం) 49లో 11 సెంట్లు, సర్వే నంబరు 78లో 16 సెంట్లు ప్రభుత్వ గెడ్డ వాగు ఆక్రమణకు గురైనట్టు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నప్పటికీ వాస్తవంగా ఇక్కడ చాలా మేరకు ప్రభుత్వ భూమిని కబ్జాచేశారు. కొండవాలు ప్రదేశాన్ని తవ్వేసి, బండరాళ్లను మందుగుండు సామగ్రితో పేల్చేశారు. అనంతరం ప్రదేశాన్ని చదును చేసి వెంచర్‌లో కలిపేసుకున్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ప్రభుత్వ భూములను ఆనుకుని జిరాయితీ భూములను కొనుగోలు చేస్తున్నారని, అనంతరం ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా గర్శింగిలో ప్రభుత్వ భూమి కబ్జాపై తహసీల్దార్ పి.లక్ష్మీదేవిని వివరణ కోరగా, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వెంకటాపురం- కొత్తపట్నం మధ్య అభివృద్ధి చేసిన రహదారి



వైసీపీ హయాంలో పరిస్థితి

ఇది రన్‌వే కాదు.. రాంబిల్లి రోడ్డు!

వెంకటాపురం-కొత్తపట్నం రోడ్డు రూ.15 కోట్లతో అభివృద్ధి

» వైసీపీ పాలనలో అధ్వానంగా ఉన్న రహదారి
» కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే మారిన రూపురేఖలు

రాంబిల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు అధ్వానంగా వున్న రహదారులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే బాగు చేయడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెంకటాపురం జంక్షన్ నుంచి వాడనర్సాపురం వెళ్లే ప్రధాన రహదారిని ఎయిర్‌పోర్టు రన్‌వే తరహాలో అభివృద్ధి చేశారు.

గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారిలో వెంకటాపురం నుంచి రాంబిల్లి, వాడనర్సాపురం మీదుగా కొత్తపట్నం వరకు సుమారు 14 కిలోమీటర్ల రహదారిపై పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ రహదారికి ఏటా నిర్వహణ పనులు చేస్తుంటారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఏడాది కూడా నిర్వహణ పనులు చేయలేదు. ఈ రోడ్డు ... మిగతా 8వ పేజీలో

టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక

» కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు

» మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ'



సమావేశంలో మాట్లాడుతున్న పప్పల చలపతిరావు, చిత్రంలో ప్రగడ నాగేశ్వరరావు తదితరులు

అచ్యుతాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. బుధవారం ఇక్కడి ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటైన గ్రీవెన్స్‌లో ఆయన మాట్లాడారు. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ వేదిక దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతాయని వివరించారు. రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు తాము ఎల్ల వేళలా అండగా ఉంటామన్నారు. చంద్రబాబు నాయుడు ఆశయాలను అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామ స్థాయి కమిటీలను నియమించడంతో పాటు నామినేటెడ్ పదవులు త్వరలో భర్తీకానున్నాయన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, పార్టీ నాయకులు ధూళి రంగనాయకులు, పోలమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, జనపరెడ్డి నర్సింగరావు, దాడి ముసిలి నాయుడు, కె.విజయబాబు, నీరుకొండ నర్సింగరావు, పొన్నమళ్ల కొండబాబులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

6 నుంచి నియోజకవర్గంలో రథయాత్ర

» విజయవంతానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ పిలుపు



ఎలమంచిలిలో మాట్లాడుతున్న ఆనంద్, చిత్రంలో చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి/అచ్యుతాపురం/ మునగపాక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల ఆరో తేదీన ప్రారంభమయ్యే శ్రీరామ రక్ష రథయాత్రను అంతా విజయవంతం చేయాలని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కోరారు. బుధవారం ఎలమంచిలిలో హిందూ ధార్మిక సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య ట్రస్టు, కేంద్ర ప్రతినిధుల సలహా మేరకు రథయాత్ర బాధ్యతను తాను తీసుకున్నట్టు చెప్పారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ రథయాత్ర విజయవంతానికి మండలాల వారీగా కమిటీలు వేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పలువురు బీజేపీ నాయకులు , హిందూ ధార్మిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇదే అంశంపై అచ్యుతాపురం, మునగపాకల్లో గల అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ సమావేశాలను ఏర్పాటు చేశారు. రథయాత్ర చేపట్టనున్న వివరాలను వెల్లడించారు. ఈ సమావేశాల్లో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, బైలపూడి శ్రీరామదాసు, కోరుప్రోలు చిన్నారావు, గంగాధర్, కూండ్రపు నాయుడు బాబు, ప్రవీణ్, బీవీ రమణ, కొల్లి అప్పారావు, శివాజీ రాజ్, బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఎలమంచిలి అభివృద్ధి

» యానాద్రి కాలువ పనులు త్వరలో ప్రారంభం » అచ్యుతాపురం- అనకాపల్లి రహదారి పనులకు 31న మంత్రి లోకేశ్ శంకుస్థాపన

» ఎలమంచిలిలో 50 ప్రైవేటు ఆస్పత్రుల ఏర్పాటుకు స్థల పరిశీలన » 'జనవాణి'లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పష్టం చేశారు. ఇక్కడి క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో కలిసి జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్న సమయంలో మినహా, అన్ని రోజుల్లోనూ తాను ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. మునిసిపాలిటీలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని యానాద్రి కాలువ పనులు త్వరలో ప్రారంభించనున్నామన్నారు. ఇటు పాయకరావుపేట, అటు పరవాడ మధ్యలో ఉన్న ఎలమంచిలిని అన్ని వసతులతో కూడిన విధంగా నివాసయోగ్యమైన ప్రాంతంగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ఎలమంచిలిలో సుమారు 50 ప్రైవేటు ఆస్పత్రులు ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలంతా ఎదురు చూస్తున్న అచ్యుతాపురం- అనకాపల్లి రహదారి పనులకు ఈ నెల 31 వ తేదీన మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేసి సుమారు 300 వరకు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు టీడీపీ, జనసేన పార్టీల పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, నాయకులు పిట్టా శ్రీను, లవుడు లోవరాజు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కర్రి రూస్వీ, అన్నం బాబ్జీ, కరణం రవి, కొరాడు శ్రీను, గుర్రాల శేఖర్, అందె రమణ, భాస్కరరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

కొండకర్ల, చోడపల్లి శివారు హద్దుల్లో గ్రావెల్ దందా..!

» ఇష్టారాజ్యంగా రాత్రి వేళల్లో తవ్వుతూ తరలింపు » కన్నెత్తి చూడని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం



గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న కొండకర్ల, చోడపల్లి శివారు ప్రాంతం

అచ్యుతాపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండకర్ల పంచాయతీ పరిధి కొండకర్ల, చోడపల్లి శివారు ప్రాంతంలో కొండ వద్ద డి.పట్టా భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పారిశ్రామికంగా ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో పలువురు నాయకులు, అధికారుల అండదండలతో గత వారం రోజులుగా రాత్రి సమయాల్లో కొందరు యంత్రాలను ఉపయోగించి గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుతున్నారు. అనంతరం టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు. గ్రావెల్ తవ్వకాలు చేపట్టి రవాణాకు ఇబ్బందులు లేకుండా మార్గాన్ని సైతం ఏర్పాటు చేసుకున్నారు. కొండకర్ల ప్రభుత్వ అతిథి గృహం వెనుక ఉన్న లేఅవుట్ నుంచి గ్రావెల్ తరలించేందుకు మార్గం ఏర్పాటు చేసుకున్నారు. పగటి పూట ఇక్కడ ఒక్కరూ కనిపించరు, రాత్రి సమయాల్లో మాత్రం తవ్వకాలతో సందడిగా ఉంటుంది. కొండకర్ల గ్రామ పరిధిలోని కొందరు నాయకులకు వాటాలు రాకపోవడంతో మంగళవారం రాత్రి వీరి మధ్య ఘర్షణ తలెత్తిందని ప్రచారంలో ఉంది. ఈ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రావెల్ తరలింపునకు కొండ వద్ద ఏర్పాటు చేసిన మార్గం

అచ్యుతాపురం పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

అచ్యుతాపురం మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అచ్యుతాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ బుధవారం తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజూ ఎంతమంది ఓపీకి వస్తున్నది, వారికి అందిస్తున్న వైద్య సేవలు తదితరాలపై ఆరా తీశారు. మందులు అందుబాటులో ఉంచడంతో పాటు వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఎమ్మెల్యేకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధుల వినతి

ఎలమంచిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న జర్నలిస్టులకు నిబంధనల మేరకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పలువురు జర్నలిస్టులు బుధవారం ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. జనవాణి కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి జర్నలిస్టుల సమస్యలను వివరించారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేయాల్సిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు గంగాధర్, శ్రీమాన్, దుబాసి రమణ, సంతోష్, చిన్నాజీ, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐదు పంచాయతీల్లో ఉప సర్పంచు ఎన్నికలు

» ఎంపీడీవో ఉషారాణి వెల్లడి

» 144 సెక్షన్ విధించిన పోలీసులు

మునగపాక, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు గురువారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మునగపాక, నారాయుడుపాలెం, నాగులాపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోను, తోటాడ, రాజుపేట గ్రామ సచివాలయాల్లోను ఉదయం పదకొండు గంటలకు ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎస్‌ఐ పి.ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్నికలు జరిగే గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈకేవైసీ కోసం పాట్లు

» రేషన్ రాదనే ప్రచారంతో పరుగులు తీస్తున్న జనం

» వేలిముద్రలు పడక ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్న వైనం



మూకాంబిక ఆలయం వెనుకన ఆధార్ నమోదు కేంద్రం వద్ద జనం పడిగాపులు

ఎస్.రాయవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నాటికి ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ రాదనే ప్రచారంతో జనం ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఎస్. రాయవరంలో ఉన్న రెండు ఆధార్ నమోదు కేంద్రాల వద్ద బుధవారం రద్దీ కనిపించింది. గత మూడు రోజులుగా జనాల తాకిడి చాలా ఎక్కువ ఉందని ఆధార్ కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. కాగా వేలిముద్రలు పడక ఈకేవైసీ నమోదు కాకపోవడంతో ఆధార్ అప్డేట్ కోసం స్థానికులతో పాటు నక్కపల్లి, కోటవురట్ల, ఎలమంచిలి మండలాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడంతో ఈ రెండు శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. దీంతో ఆధార్ అప్డేట్ చేయడానికి ఒక్కొక్కరికి సుమారు పది నిమిషాలు పైగా సమయం పడుతుండడంతో పాటు చాలా వరకు పిల్లలకు వేలిముద్రలు వేగంగా పడకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ అప్డేట్‌తో పాటు ఈకేవైసీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.ఈ

అలరించిన అంగన్‌వాడీల 'సోది' స్కిట్



స్కిట్‌ను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నక్కపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోషణ భీ-పడాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం నిర్వహించిన శిక్షణ తరగతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన స్కిట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. సోది చెప్పే వేషధారణలో అంగన్‌వాడీ కార్యకర్త చేసిన ప్రదర్శన హైలెట్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.లలిత, కె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరు

ఎస్.రాయవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి బుధవారం తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో స్వప్నప్రియారెడ్డి తెలిపారు. మొత్తం 910 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, సైన్స్ ఫిజిక్స్ పరీక్షకు ఎస్.రాయవరం పరీక్షా కేంద్రంలో నలుగురు, దార్లపూడి పరీక్షా కేంద్రంలో ఇద్దరు, కొరుప్రోలులో ఇద్దరు, అడ్డరోడ్డు తిమ్మాపురం కేంద్రంలో ఒక విద్యార్థి చొప్పున గైర్హాజరయ్యారని ఎంఈవో చెప్పారు.

పశుగ్రాస ఉత్పత్తిదారుల సంఘంలో చేరండి

» పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు



పాడి రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు

పాయకరావుపేట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశుగ్రాస పెంపకందారులు, ఉత్పత్తిదారుల సహకార సంఘంలో సభ్యులుగా చేరాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు సూచించాఉ. మండలంలోని నామవరం, శ్రీరాంపురం, సత్యవరం గ్రామాలలో బుధవారం పాడి రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పశువుల మేత, పశువులకు సమీకృత పోషకాహారం సేకరించి విక్రయించడం, పశుగ్రాస ఉత్పత్తిని అధికం చేయడం కోసం సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంఘమిత్రలో సభ్యులుగా చేరే పాడి రైతులు రూ.2 వేల విలువ కలిగిన నాలుగు షేర్లు కొనుగోలు చేయాలన్నారు. దీని వల్ల పాడి పశువులకు మేస్ దాణాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు, డెయిరీ ఫారం నిర్వహణపై శిక్షణ తరగతులు ఇస్తామన్నారు. పాడి పశువుల అనారోగ్యానికి గురైనపుడు మందులు తక్కువ ఖరీదుకే లభిస్తాయన్నారు. పశుగ్రాస ఉత్పత్తి, పాడి పశు పెంపకందారులకు మార్కెట్ సౌకర్యాలకు పెంపొందించడం, పాల ఉత్పత్తి ద్వారా గ్రామీణ యువతను ఔత్సాహిక పారిశ్రామికులుగా తీర్చిదిద్దడమే ఈ సంఘం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సాయిశంకర్, శ్రీనివాసరావు, గుప్తా, శరణ్య, ఎఫ్‌పీవో ప్రెసిడెంట్ చిట్టెమ్మ, వైస్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, టీడీపీ నేత కె.శివ, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

ఎస్.రాయవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ ఎన్నిక జరగనుంది. కొద్ది రోజుల క్రితం కోన లోవలక్ష్మి తన ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో, ఈ స్థానానికి ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ముగ్గురు టీడీపీ, ఒకరు జనసేన, మిగతా 16 మంది వైసీపీకి చెందినవారు. నూతనంగా జరుగుతున్న ఎంపీపీ ఎన్నికలో మరలా వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలే ఎంపీపీ కానున్నారు. ఇక్కడి ఎంపీపీ పదవి బీసీ మహిళ కావడంతో గురువారం జరిగే ఎన్నికలో ప్రధానంగా వైసీపీకి చెందిన కొరుప్రోలు ఎంపీటీసీ సభ్యురాలు కేసుబోయిన వెంకటలక్ష్మిని ఎంపీపీగా ఎన్నికోనున్నట్టు సమాచారం, అలాగే పెట్టుగోళ్లపల్లి ఎంపీటీసీ సభ్యురాలు వియ్యపు సత్యసూర్య విజయకుమారి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. కాగా, ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎన్నికల అధికారిణి కె.మనోరమ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

నక్కపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సంపద తయారీ కేంద్రం వద్ద బుధవారం నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందికి ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో డి.సీతారామరాజు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతుల గురించి వివరించారు. మండలంలోని అన్ని సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, వాటిని సక్రమంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్, నక్కపల్లి పంచాయతీ కార్యదర్శి మూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

85 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 85 మందికి పరీక్షలు జరిపినట్టు కో-ఆర్డినేటర్ సతీశ్ తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 20 మందికి ఆపరేషన్‌లు అవసరమని వైద్యులు నిర్ధారణ చేశామని చెప్పారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు సతీశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య ప్రశాంతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

రావికమతం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రెండు బైకులు ఢీకొని ద్దరు గాయపడ్డారు. పి.పొన్నవోలు గ్రామానికి చెందిన సిరిసాల నాయుడు (28) తన వాహనంపై మరో ఇద్దరితో కలిసి రావికమతం వచ్చారు. మెయిన్ రోడ్డు తట్టబంద సెంటర్ సమీపంలో ముగ్గురుతో వెళ్తున్న నాయుడు వాహనాన్ని, వెనుక నుంచి మరో ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు రోడ్డుపై కొంత దూరం దొర్లాయి. గాయపడ్డ నాయుడుతో పాటు మరో యువకుడిని ఆసుపత్రికి తరలించే సమయంలో, వెనుక నుంచి ఢీ కొట్టిన ముగ్గురు యువకులు పరారయ్యారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు

» అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి

రోలుగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. రోలుగుంట పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. కేసుల వివరాలు, పురోగతిపై ఆరా తీశారు. గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐలను ఆదేశించారు. డీఎస్పీ వెంట కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్‌ఐ రామకృష్ణారావు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో 'పేట' విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నవోదయ ప్రవేశ పరీక్షలో శ్రీప్రకాష్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 2025-26 విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలోకి ప్రవేశానికి జనవరి 18న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తెలిపారు. నవోదయలో సీట్లు సాధించిన ముత్యాల విశ్రుత్, మేడిశెట్టి హవిశ్, కొంజర్ల వెంకట చంద్రమౌళి, దూలపల్లి విఖ్యాత్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

29న మండల సమావేశం

పాయకరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు తెలిపారు. ఎంపీపీ ఐసరపు పార్వతి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు, సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

రైతులు ఫార్మరీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పాయకరావుపేట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ మార్చి నెలాకరులోగా ఫార్మరీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఈఎస్ఎస్ యాప్ ఉపయోగాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే యంత్ర పరికరాలు, ప్రోత్సాహకాలను తెలిపారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను రైతులు డైన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రూపావతి, కల్పన పాల్గొన్నారు.

దేవవరం మాజీ మున్సబ్ మృతి



నరసింహమూర్తి (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామం మాజీ మునసబు, చినదొడ్డిగల్లు రిటైర్డ్ వీఆర్వో కోన నరసింహమూర్తి (76) మంగళవారం రాత్రి మృతి చెందారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం ఆయన సేవలు చేశారు. నక్కపల్లి మండలం ప్రజలందరికీ సుపరిచితులు. ఆయన మృతి పట్ల సర్పంచ్ రాఘవకుమారి, గ్రామ పెద్దలు గొర్ల నరసింహమూర్తి, దేవర సత్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు.

వైస్ ఎంపీపీ ఎన్నిక రసవత్తరం

- నేడు ఎన్నిక.. వైసీపీలోనే ఇద్దరు సభ్యుల పోటీ
- గందరగోళంలో ప్రతిపక్ష ఎంపీటీసీ సభ్యులు

చోడవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్‌లో వైస్ ఎంపీపీ పదవికి గురువారం నిర్వహిస్తున్న ఎన్నిక రసవత్తరంగా మారింది. ఈ ఎన్నిక ప్రతిపక్ష వైసీపీ ఎంపీటీసీ సభ్యుల్లో ఆందోళన పెంచుతున్నది. తమ పార్టీలోనే ఈ పదవికి ఇద్దరు పోటీ చేస్తుండడంతో వారు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మండల పరిషత్‌లో వైసీపీకి చెందిన వైస్ ఎంపీపీ బి.గంగరాజు రెండున్నరేళ్ల పదవీకాలం ముగియడంతో రాజీనామా చేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 25 మంది ఎంపీటీసీ సభ్యుల్లో వైసీపీకి 20 మంది, టీడీపీకి ఐదుగురు సభ్యులు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీకి చెందిన గ్రట్టి రామలక్ష్మి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం ఆరుకు చేరింది. తరువాత జరిగిన పరిణామాలతో మరో ఇద్దరు సభ్యులు కూడా వైసీపీకి దూరంగా ఉంటున్నారు.

వాస్తవానికి ఈ ఎన్నికకు టీడీపీ దూరంగా ఉండడంతో ఏకపక్షంగా సాగుతుందని భావించినప్పటికీ, వైసీపీలోనే ఇద్దరు నేతల మధ్య పోటీ ఏర్పడడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం అంభేరుపురం ఎంపీటీసీ సభ్యురాలు శరగడం లక్ష్మికి వైస్ ఎంపీపీ పదవిని ఇవ్వాలని నియోజకవర్గ ఇంచార్జి మాజీమంత్రి అమర్, ఇటీవల ఎంపీటీసీ సభ్యులు నాయకుల సమావేశంలో నిర్ణయించి ఆమె పేరును ఖరారు చేశారు. దీనితో లక్ష్మి వైస్ ఎంపీపీ పదవి చేపట్టడం ఖాయంగా మారింది. అయితే వైసీపీలోనే మరో నాయకుడు తన భార్య పేరును ప్రతిపాదించి మద్దతు ఇవ్వాలని కోరుతుండడంతో ఈ వ్యవహారం వైసీపీలో అయోమయానికి దారితీసింది. వైస్ ఎంపీపీ పదవికి ఒకే పార్టీలో ఇద్దరు పోటీపడుతుండడంతో ఎవరికి ఓటేయాలన్న గందరగోళంలో వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఉన్నట్టు సమాచారం.

నేడు రాయపురాజుపేట ఉప సర్పంచ్ ఎన్నిక

చోడవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట ఉప సర్పంచ్ పదవికి గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు దాడి భూలోకనాయుడు రెండున్నరేళ్ల పదవీ కాలం ముగియడంతో రాజీనామా చేశారు. మిగిలిన పదవీ కాలానికి గురువారం ఎన్నిక స్వీహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాత ఒప్పందం ప్రకారం పసుపులేటి రామ్మూర్తి గురువారం ఉప సర్పంచ్‌గా ఎన్నిక కావడం లాంఛనంగా మారింది. ఈ పంచాయతీ సర్పంచ్‌గా ప్రస్తుతం టీడీపీకి చెందిన బొడ్డేడ రామునాయుడు ఉన్నారు.

వైసీపీలో 'ఎంపీపీ' గుబులు

- మెజారిటీ ఎంపీటీసీ సభ్యులు ఉన్నప్పటికీ ఆందోళన

మాకవరపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పదవికి గురువారం జరగనున్న ఎన్నికకు సంబంధించి వైసీపీలో గుబురు రేగుతోంది. మెజారిటీ సభ్యులు ఉన్నప్పటికీ, ఆ పార్టీ నేతల్లో ఆందోళన నెలకొంది. మండలంలో వైసీపీకి 11 మంది, టీడీపీకి నలుగురు సభ్యులు ఉన్నారు. వైసీపీ ఒప్పందం ప్రకారం రెండేన్నరేళ్ల బీమబోయినపాలెం గ్రామానికి చెందిన రుత్తల సత్యనారాయణను ఎంపీపీగా ఎన్నుకున్నారు. మిగిలిన మరో రెండున్నరేళ్ల మాకవరపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరావును ఎంపీపీగా ఎన్నుకోవాలని ఒప్పందం చేశారు. ఇందులో భాగంగానే ఈ నెల 27న ఎంపీపీ ఎన్నిక నిమిత్తం వైసీపీ నుంచి రుత్తల సర్వేశ్వరరావు నామినేషన్ వేసేందుకు ఆ పార్టీ ఏర్పాట్లు చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండు రోజులు క్రితమే వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు శిబిరం నిర్వహించారు. అయితే టీడీపీకి నలుగురు ఉన్న నలుగురు సభ్యులు స్తబ్దతగా ఉన్నారు. కొందరు వైసీపీ సభ్యులతో టీడీపీ అధి నాయకత్వం నేరుగా మాట్లాడినట్టు సమాచారం. శిబిరం నుంచి నేరుగా ఎన్నిక సమయానికి ఎంపీటీసీ సభ్యులను తీసుకువచ్చేందుకు వైసీపీ ఏర్పాట్లు చేసుకుంది. టీడీపీ ఎప్పుడు ఏం చేస్తుందోనని మెజార్టీ సభ్యులు ఉన్నప్పటికీ వైసీపీలో ఆందోళన కొనసాగుతోంది.

ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

దేవరాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలకు వైసీపీకి 12 మంది, టీడీపీకి ఐదుగురు ఉన్నారు. ఎంపీపీ పదవికి కిలపర్తి టీడీపీలోకి వెళ్లిపోవడంతో స్వతహాగా పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ ఎంపీపీ-1గా ఉన్న చింతల బుల్లి లక్ష్మి జూలై 22న బాధ్యతలు చేపట్టారు. అధికారికంగా గురువారం ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఎన్నిక చేతులు ఎత్తే ప్రక్రియ కావడంతో పోలీసు, రెవెన్యూ అధికారులు సమాచారం ఇచ్చామని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మంజులావాణి చెప్పారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు: డీఎస్పీ



పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

రోలుగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం సందర్శించిన ఆమె, రికార్డులను తనిఖీ చేశారు. కేసుల వివరాలు, పురోగతిపై ఆరా తీశారు. గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. డీఎస్పీ వెంట కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు పాల్గొన్నారు.

అయ్యన్న కళాశాలలో రంజాన్ వేడుకలు



రంజాన్ శుభాకాంక్షలు తెలుకుంటున్న చిన్నారులు

కె.కోటపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యన్న కళాశాలలో బుధవారం రంజాన్ వేడుకలు నిర్వహించారు. రంజాన్ విశిష్టతను ముస్లిం విద్యార్థులు వివరించారు. ఖురాన్‌లో పొందుపరచిన విశిష్టతను సహచర విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విద్యార్థులందరూ ఉత్సాహంతో ఈద్ ముబారక్ అంటూ ప్రేమానురాగాలకు ప్రతీకగా పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాసీం, నూర్జహాన్ దంపతులు విద్యార్థులు, బోధకులకు శుభాకాంక్షలు తెలిపారు.

పైపులైన్ లీకుతో వృథాగా తాగునీరు



వృథాగా పోతున్న తాగునీరు

మాకవరపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమబోయినపాలెం గ్రామం వద్ద పైపులైనుకు రంధ్రం పడడంతో తాగునీరు వృథాగా పోతోంది. గిడుతూరు వరహానదిలోని నీటి ప్రాజెక్టు ద్వారా భీమబోయినపాలెం, జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం, శెట్టిపాలెం గ్రామాలకు ఈ పైపులైను ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. భీమబోయినపాలెం వద్ద పైపులైనుకు బుధవారం రంధ్రం పడడంతో నీరంతా వృథాగా పోతోంది. అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

పంచాయతీరాజ్ శాఖపై సభ్యుల ధ్వజం

- అధికారుల పనితీరు అధ్వానంగా ఉందని మండిపాటు
- పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత లోపిస్తున్నదని అసహనం
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ అధికారుల పనితీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. అధికారుల పనితీరు అధ్వానంగా ఉందని, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సరిగా పనిచేయడం లేదని మండిపడ్డారు. పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపిస్తున్నదని అసహనం వ్యక్తం చేశారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా గొలుగొండపేట ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ మాట్లాడుతూ పీఆర్ జేఈకి పనుల విషయంలో ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్ మాట్లాడుతూ పనుల మంజూరు కోసం అధికారులు కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. వైబీ పట్నం సభ్యుడు గొర్లి వరహాలబాబు మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ ఉండకపోవడంతో పనులలో నాణ్యత ఉండడం లేదన్నారు. గొలుగొండపేట, డి.యర్రవరం వైబీ పట్నం గ్రామాలలో జల్‌జీవన్ పైపులైన్ పనులు పూర్తి చేయకపోవడంతో తాగునీటి సమస్య ఉందని సర్పంచులు ఇనపసప్పల సత్యవతి, లోకవరపు సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలో 110 మంది రైతులకు డబ్బులు పడడం లేదని, ఈ సమస్యను పరిష్కరించాలని సభ్యులు కోరారు. మండల రీ సర్వే డీటీ శివ మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స ఎంపీడీవో ఉషశ్రీ, మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పార్థసారథి, ఏవో శైలజ, ట్రాన్స్‌కో ఏఈ చంద్రమౌళి, ఉపాధి పథకం ఏపీవో చిన్నారావు, హౌసింగ్ ఏఈ రామజోగారావు, పశు వైద్యాధికారి మోక్షరెడ్డి, ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.

చెరకు రైతుల ఆందోళన



తూనిక కాటా వద్ద నినాదాలు చేస్తున్న చెరకు రైతులు

రావికమతం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రావికమతం తూనిక కేంద్రం నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి లారీలు లేక చెరకు సరఫరా నిలిచిపోవడంతో కాటా వద్ద బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. తొమ్మిది రోజుల క్రితం సుమారు 30 టైరు బండ్లతో చెరుకును రావికమతం కాటాకు తీసుకువచ్చామని, లారీలు రాక తూకం పూర్తికాక చెరుకు ఫ్యాక్టరీకి తరలించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో చెరకు ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు బూరే రాజు, ఆర్లే గోవింద, గొర్లె చిన్న, మత్స్యకనకారావు, గంజి ఈశ్వరావు, వేపాడ నాగేశ్వరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు రాలేని కారణంగా కనీసం ట్రాక్టర్లపై ఫ్యాక్టరీకి తరలించేందుకు టన్నుకు ఫ్యాక్టరీ ఇచ్చే రూ.332కు అదనంగా రైతు మరో రూ.100 ఇస్తామంటున్నా రోడ్డు గోతుల కారణంగా యజమానులు ముందుకు రాలేదని వాపోతున్నారు. ఫ్యాక్టరీ క్రసింగ్ ప్రారంభం నుంచి కాటా రైతులపై యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతున్నదని ఆరోపించారు. ఇప్పటికే చెరకు సాగు భారమై నష్టాలు సవిచూస్తున్నా, ఫ్యాక్టరీ సకాలంలో డబ్బులు ఇవ్వకపోయినా చెరకు సరఫరా చేస్తున్నామని రైతులు వాపోయారు.

12వ పీఆర్‌సీ చైర్మన్ నియామకాన్ని తక్షణమే చేపట్టాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ చైర్మన్ నియామకం తక్షణమే చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023 జూలై ఒకటో తేదీ నుంచి రావాల్సిన 12వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను ఇంతవరకు నియమించకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వం 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించినప్పటికీ అతనికి ఎలాంటి విధి విధానాలు రూపొందించకపోవడం వల్ల రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా నేటికి నియమించలేదన్నారు. చైర్మన్ నియామకం జరిగి విధి విధానాలు రూపొందించి, సంఘాలతో చర్చించి వివిధ రకాలైన ప్రతిపాదనలు పెట్టడానికి చాలా సమయం తీసుకుంటుందన్నారు. అందువల్ల తక్షణమే చైర్మన్ నియామకంతో పాటు ఐఆర్ 29 శాతాన్ని ప్రకటించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వం సరెండర్ లీవ్ ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కును హరించడం సరికాదన్నారు. జీవో నంబరు 117ని రద్దు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం చేస్తున్న కసరత్తు వల్ల కూడా ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను అన్ని హంగులతో ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు వెంకటరావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు జీఎస్ ప్రకాశ్, ఎన్. శేషుకుమార్, మాకిరెడ్డి రాజనాయుడు, రమేశ్‌రావు, కోశాధికారి జోగా రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పూజలు



శాంతి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు

నాతవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వీరభూపతి అగ్రహారంలోని పురాతన రామాలింగేశ్వర ఆలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా పార్వతీ సహిత రామాలింగేశ్వర ఆలయంలో శాంతి కల్యాణం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



కళాశాల విద్యార్థినులు నృత్య ప్రదర్శన

నర్సీపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ డే బుధవరం ఉత్సాహంగా జరిగింది. ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో ట్రైనీ డీఎస్పీ చైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉద్యోగాలలో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీఐ గోవిందరావు, కరస్పాండెంట్ గాడి సత్యవతి, డైరెక్టర్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాంబిక ఉత్సవాలు



అమ్మవారి ప్రతిమ

బుచ్చెయ్యపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ అగ్రహారం గ్రామంలో గురువారం నుంచి నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. అలాగే ఐదు జట్లతో తప్పెడుగుళ్ల ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 28న ఉదయం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. ప్రతీ రోజూ మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు.

తాగునీటి కోసం గిరిజన మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

దేవరాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు శివారు కోడాపల్లి, రామన్నపాలెం గ్రామాలకు తాగునీరు లేక గెడ్డ నీరే చరణ్యమంటూ గిరిజన మహిళలు బుధవారం నిరసన తెలిపారు. వినూత్నంగా ఖాళీ బిందెలతో ఈ కార్యక్రమం చేపట్టారు. కాశి గంగమ్మ, చెరకు సన్యాసమ్మ, చెరకు లక్షణ, జమ్ములమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ చొరవ చూపాలి

చీడికాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ ప్రత్యేక చొరవ చూపాలని టీడీపీ జిల్లా నేతలు రెడ్డి సన్యాసినాయుడు, గండి ముసలినాయుడు కోరారు. మూడు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ కిశోర్‌లింకన్‌ను బుధవారం కలిసి సన్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు బి.కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పి.దాలెంనాయుడు, రెడ్డి రాము, డి.వెంకటరమణ, టి.శ్రీను పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ

గొలుగొండ మార్చి, 26 (ఆంధ్రజ్యోతి): గుండుపాల విలేజ్ క్లినిక్‌ను టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులు, అదనపు జిల్లా మెడికల్ అధికారి ప్రశాంతి బుధవారం సందర్శించారు. ఇంటింటా సర్వేల రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు ధనుంజయ్, మధుసూదన్, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

28న నూకాలమ్మ జాతర



పూజలు అందుకుంటున్న అమ్మవారు

కృష్ణాదేవిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన లింగంపేట నూకాలమ్మ జాతరకు శుక్రవారం రాత్రి ప్రారంభం కానుంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు రాత్రి గ్రామంలో గరగలు ఊరేగిస్తారు. శనివారం ప్రత్యేక పూజలు చేస్తారు. తొమ్మిది రోజుల పాటు రేయింబవళ్లు జరిగే ఈ జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే చిన్నారులు, పెద్దలను ఆహ్లాదపరిచేలా సర్కస్, జాయింట్‌వీల్, ఊయల, తదితర ఆటలు యాంత్రాలను ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. జాతరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరాఇంచాలని ఆలయ కమిటీ చైర్మన్ కె.వరలక్ష్మి కోరారు.

మేట్‌ల ఎంపికలో జాప్యం ఎందుకు?

మాకవరపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మేట్‌ల ఎంపికలో జాప్యం ఎందుకు చేస్తున్నారని బూరుగుపాలెం సర్పంచ్ ఒబ్బలరెడ్డి వెంకటరమణ ఉపాధి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో సోషల్ ఆడిట్‌పై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశాల్లో కాగితాలపై సంతకాలు చేసేందుకు సర్పంచ్ కావాలిగాని, ఉపాధి పనులు చేసే మేట్‌ల ఎంపికలో అవసరం లేదా అని ప్రశ్నించారు. మేట్‌లను తొలగించేటప్పుడు ఎంపీడీవో ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఆయన నిలదీశారు. గ్రామంలో సోషల్ ఆడిట్ వివరాలను సిబ్బంది చదివి వినిపించారు.


ఇళ్లపై కరెంట్ లైన్లు తొలగించాలి

చోడవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చీడికాడ రోడ్డులోని ఐటీ కాలనీలో ఇళ్ల మీదుగా ఉన్న కరెంట్ లైన్లను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్ లైన్లను పరిశీలించారు. ఎన్నోసార్లు అధికారులకు సమస్యను వివరించి లైను మార్చాలని కోరినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఏఈ స్థానికంగా లేకపోడంతోనే సమస్యలు పరిష్కారం కావడం లేదని అప్పలరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పొట్నూరు అరుణ, జలగడుగుల అప్పారావు, సామాధుల రాకేష్, సామాధుల దేవి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

రావికమతం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రెండు బైకులు ఢీకొని ద్దరు గాయపడ్డారు. పి.పొన్నవోలు గ్రామానికి చెందిన సిరిసాల నాయుడు (28) తన వాహనంపై మరో ఇద్దరితో కలిసి రావికమతం వచ్చారు. మెయిన్ రోడ్డు తట్టబంద సెంటర్ సమీపంలో ముగ్గురుతో వెళ్తున్న నాయుడు వాహనాన్ని, వెనుక నుంచి మరో ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు రోడ్డుపై కొంత దూరం దొర్లాయి. గాయపడ్డ నాయుడుతో పాటు మరో యువకుడిని ఆసుపత్రికి తరలించే సమయంలో, వెనుక నుంచి ఢీ కొట్టిన ముగ్గురు యువకులు పరారయ్యారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తల్లితో కలిసి ఉన్న బాలుడు

మాకవరపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులు క్రితం తప్పిపోయిన బాలుడు బుధవారం తల్లిదండ్రుల చెంతకు చేరాడు. తామరంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు యాజమాన్యానికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. మూడు రోజులుగా వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖ ఆర్‌కే బీచ్‌లో విద్యార్థిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు.

అక్రమ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డులు

మాకవరపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరం రెవెన్యూలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌లో పంచాయతీ కార్యదర్శి బాలదొర బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 67లో 19.93 ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారని చెప్పారు. దీన్ని అక్రమ లేవుట్‌గా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఇంటర్వ్యూ..

ఇంటి పన్ను బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

-ఓ.మహేశ్, ఈవోపీఆర్‌డీ, చోడవరం



మండలంలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.2.8 కోట్లు మేర పన్ను వసూళ్లు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు రూ.1.97 కోట్లు వసూలు చేశాం. అన్ని పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ఈ విషయంలో కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. అన్ని పంచాయతీల్లో సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి మరింత పకడ్బందీగా పథకం అమలుకు చర్యలు చేపట్టాం.

ప్రశ్న: మండలంలో ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియ ఎలా ఉంది?

జవాబు: ఇంటి పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మండలంలో ఒకటి, రెండు మినహా మిగిలిన అన్ని పంచాయతీల్లో పన్నుల వసూళ్లు బాగానే జరుగుతోంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది పన్ను వసూళ్లు బాగానే ఉన్నాయి.

ప్రశ్న: పన్ను వసూళ్ల లక్ష్యం ఎంత?

జ: మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.8 కోట్లు మేర పన్ను వసూళ్లు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు కోటి 97 లక్షల రూపాయలు వసూలు చేశాం. చోడవరం, గోవాడ మేజర్ పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు సుమారు 80 లక్షల మేర బకాయిలు రావాల్సి ఉంది. వీటి వసూళ్లకు చర్యలు చేపట్టాం.

ప్రశ్న: మండలంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాల అమలు తీరు ఎలా ఉంది?

జ: అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాలు సక్రమంగా సాగాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమం కచ్చితంగా అమలు జరిగేలా చూస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ఈ కార్యక్రమాన్ని ప్రథమ ప్రాధాన్యత అంశంగా పెట్టుకున్నాం.

ప్రశ్న: తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: అన్ని పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టారు. రక్షిత నీటి పథకాల నిర్వహణపై ప్రతి రోజూ సమీక్షిస్తున్నాం. తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడాలని కార్యదర్శులకు స్పష్టం చేశాం.

ప్రశ్న: సంపద కేంద్రాల నిర్వహణ ఎలా ఉంది?

జ: సంపద కేంద్రాల నిర్వహణ మెరుగుపరుస్తున్నాం. అన్ని పంచాయతీల్లో సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి మరింత పకడ్బందీగా పథకం అమలుకు చర్యలు చేపట్టాం. కార్యక్రమం అమలులో ప్రజాప్రతినిధులు, స్థానికులను భాగస్వాములను చేస్తున్నాం.

-చోడవరం, ఆంధ్రజ్యోతి

డీటీగా నూకరాజు బాధ్యతలు



డీటీ నూకరాజు

మాకవరపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దార్‌గా కాకర నూకరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీటీగా పనిచేసిన సోమశేఖర్‌కు ఎలమంచిలి సీఎస్‌డీటీగా డిప్యూటేషన్ బదిలీ చేస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది డీటీకి అభినందనలు తెలిపారు.

రీ సర్వేపై అవగాహన సదస్సు

గొలుగొండ మార్చి, 26 (ఆంధ్రజ్యోతి): కొమిర రెవెన్యూ గ్రామంలో భూముల రీ సర్వేపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వేకు రైతులు తమ పట్టాదారుల పాసు పుస్తకాలు, రికార్డులతో హాజరుకావాలని సూచించారు. ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లితే సవరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ఛైన్లు, సర్వేయర్ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

నర్సీపట్నం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న స్వయం ఉపాధి రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.ఉషాశ్రీ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించే ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న వారంతా రెండు సెట్ల దరఖాస్తులతో హాజరు కావాలని ఆమె సూచించారు.



మరమ్మతులకు నోచని తోటలూరు డీఆర్ డిపో



కొమ్మిక జీసీసీ భవనం దుస్థితి

గాడి తప్పుతున్న రేషన్ పంపిణీ

- శిథిలస్థితిలో జీసీసీ డీఆర్ డిపోలు, ఎంఎల్ఎస్ పాయింట్లు
- పాడైపోతున్న బియ్యం, నిత్యావసర సరకులు
- నష్టం పూడ్చుకునేందుకు సిబ్బంది పక్కదారి

కొయ్యూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిత్యావసర సరకుల పంపిణీకి వీలుగా ఏర్పాటుచేసిన గిరిజన సహకార సంస్థ డీఆర్ డిపోలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకుసిద్ధంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే కారిపోతున్నాయి. కొయ్యూరు జీసీసీ బ్రాంచి పరిధిలో 59 డీఆర్‌డిపోలు, కృష్ణాదేవిపేటలో ఎంఎల్ఎస్ గోదాం, డీఆర్ గొడౌన్, కాకరపాడులో, కొయ్యూరులో మరో రెండు గొడౌన్‌లతో పాటు కొయ్యూరులో సూపర్ బజార్, జీసీసీ బ్రాంచి కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా మండలంలోని 17084 రేషన్ కార్డు లబ్ధిదారులకు 279 మెట్రిక్ టన్నుల బియ్యం, పంచదార 98 క్వింటాళ్ల కందిపప్పుతదితర నిత్యావసర సరకులు ప్రతీ నెలా పంపిణీ చేస్తున్నారు. వీటిలో గొడౌన్‌లతో పాటు సూపర్‌బజారు, బ్రాంచి కార్యాలయం శిథిలావస్థకు చేరగా.. మంప, కొమ్మిక డిపోలు దారుణ స్థితిలో ఉన్నాయి. 42 డిపోలు జీసీసీ భవనాలలో నడుస్తున్నాయి. వీటిలో 18 డిపోలు మాత్రమే సరకులు నిల్వ చేసేందుకు వీలుగా ఉన్నాయి. మిగిలిన 22 కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో 16 డిపోలు అద్దె భవనాలలో నడుస్తున్నాయి. ఈ డిపోల్లో సరకులు పంపిణీకి గానూ సిబ్బంది కూడా కేవలం సంస్థకు చెందిన సేల్స్‌మెన్ ఒకరు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు సిబ్బంది ఐదుగురు, డీలర్లు 22 మంది ఎస్‌హెచ్‌జీల 26 రేషన్ పంపిణీ చర్యలు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ డిపోలలో బియ్యం తదితర సామగ్రి నిల్వ చేయటంతో సరకులుపాడైపోతున్నాయి. లబ్ధిదారులు ముక్కిపోయిన బియ్యం వండుకుతినే పరిస్థితులు నెలకొంటున్నాయి. అలాగే, శిథిల భవనాల్లో విధి నిర్వహణకు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు పెచ్చులు ఊడిపడతాయోననే భయంతో ఆందోళన చెందుతున్నారు. గోడలు బీటలు వారడంతో పందికొక్కులు, ఎలుకలు, గోతులు తీసి నిల్వ చేసిన సరకులు పాడు చేస్తున్నా యి. వర్షాకాలంలో సమస్య మరీ అధికంగా ఉంటోంది. ఈ నష్టాలను అధిగమించేందుకు సిబ్బంది అడ్డదారులు తొక్కుతూ లబ్ధిదారులను మోసం చేసే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇకనైనా కూటమి ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణాలకు వీలుగా నిధులు కేటాయించాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు.

భవనాల నిర్మాణానికి ఆదాయంలేదు..: స్థానిక బ్రాంచి మేనేజర్ విజయకుమార్

ఈ విషయమై స్థానిక బ్రాంచి మేనేజర్ విజయకుమార్‌ను సంప్రదించగా.. బ్రాంచి ఆదాయంలో డబ్బులు రూ. 10 లక్షల వరకు వెచ్చించి మరమ్మతులు, రూ. 40 లక్షలతో ఎంఎల్ఎస్ పాయింట్ కొత్తది నిర్మించుకునే ఉంది. కానీ అంత ఆదాయం బ్రాంచి లేదు. శిథిలావస్థకు చేరిన డిపోల స్థానంలో నూతన భవన నిర్మాణాలకు గానూ ప్రతిపాదనలు అడగారని ఇప్పటికే పలుసార్లు పంపినా నిధులు మంజూరుకాలేదని చెప్పారు.

ధారాలమ్మ అమ్మవారి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 29న ప్రధాన పండగ

సీలేరు, మార్చి 26 , (ఆంధ్రజ్యోతి): ధారకొండ ఘాట్ రోడ్డులో కొలువుదీరిన ధారాలమ్మ 59 వార్షిక మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. ఈ అమ్మవారిని గిరిజనులు తమ ఆరాధ్య దైవంగా కొలుస్తుంటారు. ఏటా ఉత్సవాలను కొత్తఅమావాస్యకు నిర్వహిస్తుంటారు. ధారాలమ్మను ఈ ప్రాంత గిరిజనులే కాకుండా ఉత్తరాంధ్ర, ఉభయ తూర్పుగోదావరి జిల్లాల తోపాటు సరిహద్దునున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల ప్రజలు దర్శించుకుంటారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా భక్తులు నమ్మకం. ఈ నేపథ్యంలో ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి కలశ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలతో అలంకరించారు. ఈ నెల 29న కొత్త అమావాస్య రోజున అమ్మవారి ప్రధాన పండుగ నిర్వహించేందుకు ఆలయ ఈవో ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. ముందుగా ఈ నెల 27 న అమ్మవారి సన్నిధిలో పెద్ద జాగరణ కార్యక్రమం నిర్వహి స్తారు. ఈ నెల 30 తో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఐదురోజులపాటు అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నసమారాధన ఉంటుంది. అమ్మవారి ప్రధాన పండగ రోజు దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు, అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు ఈ సందర్భంగా తెలిపారు.



అలంకరణలో అమ్మవారు



ఆలయాన్ని ముస్తాబు చేసిన దృశ్యం

రేపటి నుంచి ఆదివాసీ గిరిజన తత్వ ప్రబోధ ఉగాది మహోత్సవాలు

పెదబయలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమంగి గ్రామంలో 70 ఏళ్ల తరువాత ఆదివాసీ గిరిజన వేదాంత తత్వ ప్రబోధ ఉగాది మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ లోచల భగీరథ నంద స్వామి, కుంబిడి సత్యానంద స్వామీ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 28, 29, 30 తేదీలలో పరిపూర్ణ బ్రాంతి రహిత సభలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్ర వారి వారసత్వ భక్తులు సుమారు 20 మంది వస్తారన్నారు. అలాగే, వివిధ ప్రాంతాల నుంచి 700 మంది గురువర్యులు హాజరవుతారని చెప్పారు. మూడు రోజులపాటు ఉపదేశాలు, పూజలు, హరిభజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు జి. మాడుగుల ఎంపీపీ ఎన్నిక

- రాజకీయంగా ఉత్కంఠ

జి.మాడుగుల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నిక గురువారం జరగనుంది. మండలంలో 15 ఎంపీటీసీ సెగ్మెంట్లు ఉండగా... ఇందులో నుర్మతి- భీరం ఎంపీటీసీ సభ్యుడు (వైసీపీ) మృతి చెందారు. కె. కోడాపల్లి సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు అప్పట్లో రాజీనామా చేశారు. మిగిలిన 13 మంది సభ్యుల్లో ఏడుమంది టీడీపీలో ఉన్నారు. వైసీపీకి ఆరు మంది బలపరుచుతున్నారు. ఇరు పార్టీలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు వారి క్యాంపెయిన్లలో ఉన్నారు. అయినా, పలు రాజకీయ పరిణామాల నేపథ్యంలో మండలాధ్యక్ష పదవీ ఏ పార్టీకి వరించనుందోనన్న ఉత్కంఠత నెలకొంది. టీడీపీకి కోరం సభ్యులున్నా, వైసీపీ శ్రేణులు ఎంపీపీ పీఠానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

పోషణతో కూడిన విద్యనందించాలి: ఎంపీడీవో



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పోషణతో కూడిన విద్యనందించాలని ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు. సీతగుంట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల - 1లో అంగన్‌వాడీలకు జరుగుతున్న పోషణ్ బీ - పఢాయి బీ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీలో బోధించే ప్రాథమిక విద్యే పునాది అని అన్నారు. అందువల్ల వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని కోరారు. తల్లిదండ్రులు చిన్నారులను సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పుష్పజోసెఫ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కుల, ఆదాయ ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ రవి కుమార్

చింతపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కులం, ఆదాయం, జనన, మరణ ధ్రువ పత్రాలు సకాలంలో మంజూరుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక తహసీల్దార్ బి. రవికుమార్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావుతో కలిసి గ్రామ సచివాలయం ఉ ద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లీగల్ సెల్ అథారిటీ ప్రజలకు అవసరమైన సేవలను నిర్ణీత సమయానికి ముందుగానే అందజేయాలని సూచించిందన్నారు. ప్రధానంగా కులం, ఆదాయం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటూ మ్యూటేషన్ చేసే సమయంలో డీఏలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసే సమయంలో అక్షర దోషాలులేకుండా వ్యక్తుల వివరాలు నమోదు చేయాలన్నారు. వివిధ ధ్రువపత్రాలను పరిశీలించి వెంటనే తహసీల్దార్ లాగింగ్‌కి పంపించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పీ4 సర్వే, ఇళ్ల పన్ను వసూలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ రమణబాబు

చింతపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల కోసం గిరిజనులు ఈనెల 31లోగా సర్వే చేయించుకోవాలని స్థానిక హౌసింగ్ ఏఈ కె. రమణబాబు కోరారు. బుధవారం హౌసింగ్ అధికారులతో జనసేన,బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ అర్హులైన ప్రతి గిరిజనుడుకి పక్కా గృహం మంజూరుకు పీఎంఏవై 2.0 సర్వే చేపడుతున్నామన్నారు. మండలంలో 2,889 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వే చేస్తున్నారన్నారు. అలాగే, ఇంకా మిగిలిన గిరిజనులు నెలాఖరులోగా ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో జియోట్యాగింగ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సాగిన బాలకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు సరికాదు

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి



లోతేరు పాఠశాలలో మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పిస్తున్న శ్రీరాములు

అరకులోయ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత సమాజంలో మూఢ నమ్మకాల వెంటపడడం సరికాదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉ పాధ్యక్షుడు త్రిమూర్తులురెడ్డి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ , అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాస్ సూచించారు మండలంలో ఇటీవల లోతేరు పంచాయతీ పరిధి డుంబ్రిగుడలో అడారి డొంబు అనే వృద్ధుడిని చిల్లంగి పేరిట గ్రామస్థులు సజీవదహనానికి పాల్పడి జైలు పాలయ్యారన్నారు. ఈ నేపథ్యంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అరకు సర్కిల్ పోలీసుల సహకారంతో లోతేరు పాఠశాల ప్రాంగణంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి శ్రీరాములు గిరిజన ప్రాంతంలో జరుగుతున్న మూఢనమ్మకాలు, మోసాలపై వివిధ రకాల మ్యాజిక్ షో ద్వారా గిరిజనులు, విద్యార్థులకు చైతన్య పరిచారు.సైన్స్‌ను నమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోతేరు సర్పంచ్ గుబాయి కళావతి, జనవిజ్ఞాన వేదిక సభ్యుడు, అధ్యాపకుడు డాక్టర్ శోభన్, పాస్టర్ ఇస్సాకు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో రామన్న, వీఆర్‌వో నాగేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ తాతబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై కేంద్రం బృందం సంతృప్తి



అనంతగిరి పీహెచ్‌సీ ఆవరణలో కేంద్ర బృందం

అనంతగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల స్థానిక పీహెచ్‌సీని కేంద్ర బృందం మంగళ, బుధవారాల్లో ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఢిల్లీ నుంచి వచ్చిన వైద్యాధికారి షణ్ముఖ వేల్, మనీష ఆధ్వర్యంలో ఈ తనిఖీలు సాగాయి. ముందుగా రికార్డులను పరిశీలించారు. పిహెచ్‌సీ ద్వారా అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీకి వచ్చేరోగులకు దూరం భారంపై అడిగితెలుసుకున్నారు.. రవాణా సదుపాయాలపై ఆరాతీశారు. ఆ స్త్రి ప్రసవాలపై మహిళలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బంది సూచించారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసులు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్యాధికారులు జ్ఞానేశ్వరి, జాహ్నవిలకు సూచించారు. ఈ కార్యక్రమంలోని వైద్యాధికారులు రాణా, మంజుబార్గవి, రాంబాబు, ఉపేంద్ర, ఎంపీహెచ్‌ఈవో నరసింగరావు, పీహెచ్ఎన్ బాలమ్మ, త్రివేణి, సర్వలక్ష్మి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిని ఆరోగ్యంపై నిర్లక్ష్యం'

అనంతగిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కిమిడి దివ్య గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడినా హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తెడబారికి ఆనందరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాలికను బుధవారం కుటుంబ సభ్యులు అనంతగిరి పీహెచ్‌సీకి తరలించి, వైద్యసేవలను అందించారు. ఈసందర్భంగా ఆనందరావు ఆమెను పరామర్శించిన అయన హెచ్‌ఎం, వార్డెన్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన తల్లి కుమార్తె పరిస్థితి చూసి, ఇంటికి తీసుకువచ్చారని తెలిపారు. పాఠశాలలోమూడురోజులుగా జ్వరంతో బాధపడితే సిబ్బంది మాత్రలు ఇచ్చి వదిలేశారన్నారు. అనంతరం బాలికలను మెరుగైన వైద్యసేవలకు అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు.



వైద్యసేవలను పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న టీడీపీ నేత ఆనందరావు

సమస్యలపై వినతి



గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

జి.మాడుగుల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి 'కార్యకర్తే అధినేత' గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో సమస్యలపై వినతిపత్రమిచ్చినట్టు టీడీపీ నాయకులు కొండలరావు, కల్యాణం చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలో కష్టబడి పనిచేస్తున్న పలువురు కార్యకర్తలను గిడ్డి ఈశ్వరి సన్మానించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాస్‌నాయుడు, పి.రాంబాబు, పి.పెంటయ్య, పిన్నయ్య, చిట్టినాయుడు, కొండబాబు, సూర్యనారాయణ, బాలక్రిష్ణ మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ సతీశ్ మృతి తీరనిలోటు: జేసీ



సతీశ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, డీఆర్‌వో పద్మలత, తదితరులు

పాడేరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సీనియర్ అసి స్టెంట్ బి. సతీశ్ మృతి తీరనిలోటని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జే అభిషేక్‌గౌడ అన్నారు. సతీశ్ బుధవారం తెల్లవారుజామున బ్రెయిన్‌స్ట్రోక్‌తో హఠాన్మరణం చెందారు. దీంతో కలెక్టరేట్‌లో సతీశ్ చిత్రపటానికి జేసీ , డీఆర్‌వో కె.పద్మలత, తదితరులు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ..... సతీశ్ ఆదర్శనీయమైన సేవలు అందించారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించు కోవాలని జేసీ సూచించారు.ఈ కార్యక్రమంలో, కలెక్టరేట్ సూపరిం టెండెంట్ సీహెచ్.తిరుమలరావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, డివిజ నల్ పీఆర్‌వో పి.రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.గణేశ్, ఎస్‌టీవో ఎన్.సరిత, వివిధ విభాగాల అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌కు ఉద్యోగోన్నతి

ముంచంగిపుట్టు, మార్చి 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని జర్రెల ప ంచాయతీ డేగలపుట్టు గ్రా మ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న తలారి శ్రీదేవికి కార్యకర్తగా నియమిస్తూ సంబంధిత ధ్రువపత్రాన్ని సీడీపీవో వరహాలమ్మ బుధవారం అందించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అనారోగ్యంతో ఇటీవల ఆ గ్రామంలో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందడంతో, ఆమె స్థానంలో హెల్పర్‌గా పని చేస్తున్న శ్రీదేవిని కార్యకర్తగా పదోన్నతి కల్పిస్తూ ఉత్వర్వులిచ్చామన్నారు.

ధారకొండ సంత ఆశీలు వేలం రేపు

సీలేరు, మార్చి 26 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలో సంత ఆశీల వేలం శుక్రవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌లు సీహెచ్ రాజ్యలక్ష్మీ, ఎన్. రాజు తెలిపారు. ఈ పాటలో పాల్గొన దలచిన వారు పంచాయతీ నిబంధనల మేరకు ముందుగా డిపాజిట్ చెల్లించాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గూడెంకొత్తవీధి:అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక సీడీపీవో ఎ.లక్ష్మీదేవి తెలిపారు. మండలంలో రెగ్యులర్ అంగన్‌వా డీ కేంద్రాలు లక్కవరపుపేట పంచాయతీ పరిధి సువరం, సంకాడ పంచాయతీ గోవాడలో కేం ద్రాల్లో ఒక్కొక్క ఆయా పోస్టులు, ధారకొండ పంచాయతీ ఏగుగుబయలులో మినీ కార్యకర్త, పీఎం జన్‌మన్ పథకంలో మంచుల పంచాయతీ తీములబందలో ఆయా పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నాలుగు పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక గిరిజన మహిళలు అర్హులన్నారు. వయస్సు 21-35 మధ్య ఉండాలన్నారు. ఏప్రిల్ 4వ తేదీలోగా జీకేవీధి ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సీడీపీవో వరహాలమ్మ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు-2, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు-3, ఆయాలు-3 పోస్టులతో పాటు పీఎం జన్‌మన్ కింద నూతనంగామంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 ఆయా పోస్టులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: అంగన్‌వాడీ కార్యకర్త , ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో విజయకుమారి తెలిపారు. కొయ్యూరు ప్రాజెక్టు పరిధి ఎం. భీమవరం పంచాయతీ జెర్రిగొంది, యు. చీడిపాలెం ఆయా పోస్టులతో పాటు ఆడాకుల పంచాయతీ డి. కొత్తూరు, ఎం. భీమవరం శివారు వాలుగూడెం, కినపర్తి పంచాయతీ మునగలమెట్ట మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. వీటికి పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక గిరిజన మహిళలు అర్హులన్నారు. వయస్సు 21-35 మధ్య ఉండాలన్నారు. ఈ నెల 26 తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ లోగా స్థానిక ప్రాజెక్టు కార్యాలయంకు దరఖాస్తులు అందచేయాలని సీడీపీవో తెలిపారు.

సమస్యలపై పెట్రోల్ బంక్ ఇన్‌చార్జీల వినతి



జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న బంక్‌ల ఇన్‌చార్జీలు

పాడేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్, డీజిల్ బంక్‌ల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని బంక్‌ల ఇన్‌చార్జీలు ఆ సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ కోరారు. ఈమేరకు బుధవారం వారంతా ఇక్కడికి వచ్చి శ్రావణ్‌కుమార్‌కు తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా బంకులకు ఆయిల్ హ్యాండ్లింగ్ చార్జీల వల్లే తమకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయిల్ విక్రయాల నేపథ్యంలో ఏర్పడే తరుగును సైతం సంస్థకు నిర్వాహకులతో చెల్లింపులు చేయిస్తున్నారన్నారు. దీంతో శ్రద్ధగా బంక్‌లు నిర్వహిస్తున్నా నష్టాలు వస్తున్నాయన్నారు. ఈ నష్టాన్ని తమపై వేస్తున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని 16 మంది బంక్ నిర్వాహకులు కోరారు.

తాగునీటి సమస్యపై ఆందోళన



పెదపాయిపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పెదబయలు, మార్చి 26 (ఆం ధ్రజ్యోతి): మండలం పరిధి పెదకోడపల్లి పంచాయతీ పరిధి పెదపాయిపల్లి, నైమంగొంది గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై బుధవారం పెదపాయిపల్లిలో మహి ళలు, గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాలలో గ్రావిటీ ద్వారా సరఫరా చేస్తున్న జలాలు అడుగంటాయన్నారు. దీంతో గత వారం రోజులుగా చుక్కనీటికి ఇబ్బంది ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీంతో సుమారు అరకిలోమీటరు దూరంలో గల లోయలో నుంచి ఊట నీటిని సేకరించాల్సి వస్తోందన్నారు. ఈ నీటిని తాగటంతో వివిధ రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. ఆది వాసీ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్లు భీముడు, ధర్మారావు ప్రస్తుతం నీటి వసతులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో కలసి వాటిని శుభ్రం చేసి, బ్లీచింగ్ జల్లారు.

'రక్తదానం గొప్పది'



రక్తదానం చేస్తున్న విద్యార్థినులు

కొయ్యూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దానాలన్నిటిలోనూ రక్తదానం చాల గొప్పదని తహసీల్దారు ఎస్ఎల్‌వీ ప్రసాద్, ఎంపీడీవో ఎకేవీ ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరు ఆదేశాలతో బుధవారం మండలంలో మర్రిపాలెం మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇం డియన్ రెడ్‌క్రాస్ సంస్థ, కళాశాల ఎన్ఎస్ఎస్ సారథ్యంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కేజే రాఘవేంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మెంబరు బి. రాజు, వైస్ చైర్మన్ గంగరాజు, జిల్లా కార్యదర్శి జి. గౌరీశంకర్, డౌనూరు, మూలపేట వీఆర్‌వోలు జయవాణి, కుమారి, డౌనూరు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పసుపు ధర పెంపు : జీసీసీ డీఎం

చింతపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ పసుపు కొనుగోలు ధర పెంచిందని స్థానిక డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కోసం జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. మార్కెట్ ప్రారంభంలో జీసీసీ పసుపు కిలో రూ.100ధరకు కొనుగోలు చేసిందన్నారు. ప్రస్తుతం కిలోకి రూ.15 పెంచి రూ.115 ధరకు కొనుగోలు చేస్తామన్నారు. అలాగే రాజ్‌మా ఎరుపులు కిలో రూ.90, బొబ్బర్లు రూ. 50, రాగి కిలో రూ.35, ఎండుమిర్చి రూ. 145 ధరలకు కొనుగోలు చేస్తున్నామన్నారు.

చెట్టు కూలి పూరిల్లు ధ్వంసం



ఇంటిపై పడిన జీలుగుచెట్టు

కొయ్యూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కినపర్తి పంచాయతీ వలసంపేటలో గాలివానకు జీరుగు చెట్టు పడి పూరిల్లు ధ్వంసమైంది. బుధవారం సాయంత్రం మండలంలో భారీ వర్షం కురిసింది. వలసంపేటలో చెదల శాంతమ్మ ఇంటిపై జీరుగుచెట్టు కూలడంతో గృహంపైకప్పు, గోడలు కూలిపోయాయి. నిరాశ్రయురాలైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని శాంతమ్మ అభ్యర్థించింది.

తాగు నీటి సమస్యపై సభ్యులు ఏకరువు

- దీర్ఘకాలంగా ప్రస్తావిస్తున్నా పట్టించుకునేవారు కరువు
- సబ్బవరం మండల సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీల ఆవేదన



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తాగు నీటి సమస్యపై పలువురు ప్రజా ప్రతినిధులు ఏకరువుపెట్టారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో మండల ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆమె కోరారు. దీంతో పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న నీటి ఇబ్బందులను సభ ముందు ఉంచారు. బంగారమ్మపాలెం సర్పంచ్ దాడి లావణ్య మాట్లాడుతూ గ్రామంలో రెండు వందల కుటుంబాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు. అలాగే, పైడివాడ, పైడివాడ అగ్రహారం ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి కష్టాలు తీరడం లేదని, ఈ సమస్యను పలుమార్లు సమావేశాల్లో ప్రస్తావించినా పరిష్కరించేవారు కరువయ్యారని ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు వాపోయారు. టెక్కలిపాలెంలో తాగు నీటిలో క్లోరిన్ ఉందని ఎప్పటి నుంచో చెబుతున్నా పట్టించుకునేవారు లేకపోయారని సర్పంచ్ గొంప సత్య వమ్మ సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశాల మేరకు రూ.150 కోట్లతో అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధి భూదేవి చెరువు వద్ద మంచినీటి ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. శాఖల వారీగా ఎంపీపీ సమీక్ష నిర్వహించగా, వెలుగు ఏపీఎం మాట్లాడుతూ ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో ఫారమ్ పాండ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. గ్రామానికి రెండు చొప్పున పశువులకు నీటి తొట్టెలు మంజూరు చేసినట్టు వివరించారు. తహశీల్దార్ చిన్నికృష్ణ మాట్లాడుతూ సబ్బవరం డిగ్రీ కళాశాల పక్కన ఉన్న సంపద కేంద్రం తరలించాలని డిమాండ్ ఉందని, ఇందుకోసం అసకపల్లిలో స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు. నల్లరేగులపాలెంలో రేషన్ సరకులు సరిగా పంపిణీ చేయాలని సర్పంచ్ పెతకంశెట్టి లక్ష్మి కోరారు. వ్యక్తిగత వ్యవసాయ యంత్ర పరికరాల కోసం దరఖాస్తులు చేసుకుంటే, ఖరీఫ్ నాటికి రాయితీపై అందజేస్తామని ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది 270 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.60 లక్షలు చెల్లించినట్టు వివరించారు. ఆర్‌ఈసీఎస్ పరిధిలో లో ఓల్టేజీ సమస్య పరిష్కరించామని ఏఈ వీరేంద్ర తెలిపారు. బాటజంగాలపాలెం, నల్లరేగులుపాలెం గ్రామాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నట్టు సర్పంచులు పడాల వెంకటరమణ, పెతకంశెట్టి లక్ష్మి వివరించారు. లగిశెట్టిపాలెంలో అంగన్‌వాడీ టీచర్ లేకపోవడం వల్ల అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ ఇబ్బందికరంగా ఉందని సర్పంచ్ పాలిశెట్టి పార్వతి వివరించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని సూపర్‌వైజర్ స్వర్ణలత సమాధానం ఇచ్చారు. గృహ నిర్మాణ పథకంలో భాగంగా అసం పూర్తిగా నిలిచిపోయిన ఇళ్లకు ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 మంజూరు చేసిందని ఉపాధి హామీ పథకం ఏపీఎం తెలిపారు. అనంతరం మరికొంత మంది సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి.పద్మజ, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎస్ఐ దివ్య తదితర అధికారులతో పాటు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన

- నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను
- ఇప్పటికే ఆలయం వద్ద చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణ పూర్తి చేసినట్టు వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ నాగశ్రీను, చిత్రంలో ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత ఇక్కడి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తెలిపారు. ఆలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవి ఆరంభమైన దృష్ట్యా భక్తులు ఎండబారిన పడకుండా ఉండేందుకు ఆలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. 28వ తేదీ రాత్రి కొత్త అమావాస్య జాతర ప్రారంభం కానుందన్నారు. 29న కొత్త అమావాస్య, 30న ఉగాది వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 27వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ జాతర జరుగుతుందని వివరించారు. జాతర అనంతరం మరో రెండు నెలల వరకు ఆలయానికి ఉత్తరాంధ్రలోనే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరిక మేరకు ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. ఏర్పాట్లలో భాగంగా ఇప్పటికే ఆలయానికి వచ్చే మార్గాలను తీర్చిదిద్దామన్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేపట్టామన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో పాటు ఎంపీ సీఎం రమేష్, ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పలువురు ఎమ్మెల్యే జాతరకు విచ్చేయనున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వివరించారు.

ఉత్సవ ప్రత్యేకాధికారిణి కె.శోభారాణి మాట్లాడుతూ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పోలీస్ పికెట్‌తో పాటు వైద్య శిబిరాన్ని ఆలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులకు తాగు నీరు, చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు వంటివి అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఈవో వెంపలి రాంబాబుతో పాటు ధర్మకర్తలు దాడి రవికుమార్, సూరే సతీష్, పొలిమేర ఆనంద్, కాండ్రేగుల జగ్గారావు, మారిశెట్టి శంకరరావు, కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయం రోడ్డులో ఆక్రమణల తొలగింపు

- అధికారులతో పలువురు వ్యాపారులు వాగ్వాదం



ఆలయం రోడ్డులో తొలగించిన ఆక్రమణ

అనకాపల్లి టౌన్ : నూకాంబిక ఆలయం రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు జీవీఎంసీ అనకాపల్లి జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లోని రోడ్లపై ఉన్న పలు దుకాణాలను తొలగించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి కనకారావు పోలీసుల సహకారంతో పలు దుకాణాల తొలగింపు చేశారు. అయితే పలువురు దుకాణదారులు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాము ఇక్కడ కొబ్బరికాయలు, అరటిపండ్లు, పసుపు, కుంకుమలు, చీరలు విక్రయిస్తూ కుటుంబాను పోషించుకుంటున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా దుకాణాలను తొలగించడం అన్యాయమంటూ వాపోయారు. చాలా వరకు దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ విషయాన్ని బాధితులు దేవదాయశాఖ అధికారులు, కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. జాతర సందర్భంగా వారు కూడా ఏమీ మాట్లాడలేనట్టు తెలిసింది. ఆక్రమణల తొలగింపు విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారి కనకారావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, చాలా వరకు బడ్డీలను, దుకాణాలను తొలగించామన్నారు. పలువురు దుకాణదారులు తామే సొంతంగా తొలగిస్తామని చెప్పడంతో సమయం ఇచ్చామని ఆయన తెలిపారు.



అధికారులతో దుకాణాదారులు వాగ్వాదం

29న వెన్నెలపాలెంలో నూకాంబిక జాతర



నూకాంబిక జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామపెద్దలు

పరవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వెన్నెలపాలెంలో ఈ నెల 29న నిర్వహించనున్న నూకాంబిక అమ్మవారి జాతరకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరపనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, జాతరను పురస్కరించుకొని రాత్రి ఏడు గం టల నుంచి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఈ వేడకకు మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పైలా రథాల సన్యాసిరావు, పైలా అప్పలనాయుడు, వెన్నెల ప్రసాద్, లోకిరెడ్డి అభిసన్యాసినాయుడు, బోజంకి నాయుడు, బండారు సతీష్, పైలా ప్రసాద్, గొంప మారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి



భద్రతా వారోత్సవాల ముగింపోత్సవంలో శివశంకర్‌రెడ్డి తదితరులు

పరవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివ శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫార్మా సిటీలో గల మ్యూచువలీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విధులను నిర్వర్తించాలన్నారు. యాజమాన్యాలు కూడా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీఎస్ నారాయణరావు, ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కార్మికుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్ల అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో బి.అన్నవరం, కేబీ నాయుడు, టీవీ నాయుడు, ఎస్ఆర్ బాబులు కూర్చున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు వీరికి సంఘీభావం తెలిపారు.

పిల్లలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సబ్బవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో మూడు రోజులుగా అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రొంగలి పైడితల్లి మాట్లాడుతూ పిల్లలో పోషకాహార లోపం, పరిసరాల పరిశుభ్రత లోపం, వ్యకిగత అపరిశుభ్రత తదితర కారణాల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అనంతరం పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడపాలెంలో మంచినీటి ట్యాంకు లీకేజీ



కశింకోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పరవాడపాలెం గ్రామంలో మంచినీటి ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. ఇటీవల నిర్మించిన ఈ ట్యాంకు లీక్ కావడంపై పలువురు వాపోతున్నారు. వేసవి కాలం ఆరంభమైన నేపథ్యంలో నీటిని ఆదాయా చేయాల్సి ఉండగా, ఇలా వృథాగా పోతున్నా గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గాని పట్టించుకోకపోవడం ఏమిటని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

12వ పీఆర్‌సీ చైర్మన్ నియామకాన్ని తక్షణమే చేపట్టాలి

- జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ చైర్మన్ నియామకం తక్షణమే చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023 జూలై ఒకటో తేదీ నుంచి రావాల్సిన 12వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను ఇంతవరకు నియమించకపోవడం విచారకరమన్నారు. గత ప్రభుత్వం 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించినప్పటికీ అతనికి ఎలాంటి విధి విధానాలు రూపొందించకపోవడం వల్ల రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా నేటికి నియమించలేదన్నారు. చైర్మన్ నియామకం జరిగి విధి విధానాలు రూపొందించి, సంఘాలతో చర్చించి వివిధ రకాలైన ప్రతిపాదనలు పెట్టడానికి చాలా సమయం తీసుకుంటుందన్నారు. అందువల్ల తక్షణమే చైర్మన్ నియామకంతో పాటు ఐఆర్ 29 శాతాన్ని ప్రకటించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చిన బ్బాయి మాట్లాడుతూ ప్రభుత్వం సరెండర్ లీవ్ ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కును హరించడం సరికాదన్నారు. జీవో నంబరు 117ని రద్దు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం చేస్తున్న కసరత్తు వల్ల కూడా ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను అన్ని హంగులతో ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షులు వెంకటరావు, సహా అధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శులు జీఎస్ ప్రకాశ్, ఎన్.శేషుకుమార్, మాకిరెడ్డి రాజనాయుడు, రమేశ్‌రావు, కోశాధికారి జోగా రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో స్కేటింగ్ కోర్టు మార్గం

- వీధి లైట్లు లేక రాకపోకలకు ఇబ్బందులు
- క్రీడాకారులకు మరిన్ని అవస్థలు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



రాత్రి వేళ అంధకారంలో ఉన్న స్కేటింగ్ కోర్టు రోడ్డు

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీనారాయణ నగర్‌లో గల స్కేటింగ్ కోర్టుకు వెళ్లే మార్గం చీకటి పడితే అంధకాంగా మారుతోంది. ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో చాలాకాలంగా నివాసితులతో పాటు స్కేటింగ్ క్రీడకు వచ్చే క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' అనే పేరుతో 'ఆంధ్రజ్యోతి' ఇటీవల నిర్వహించిన చర్చా వేదికలో పలువురు ఈ సమస్యను జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు కూడా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పి నెలన్నర రోజులు దాటినా నేటి వరకు ఎటువంటి పరిష్కార మార్గం కానరాలేదు. దీంతో ఆ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో స్కేటింగ్ కోర్టు కాకుండా పార్కు, నివాస గృహాలు ఉన్నాయి. క్రీడాకారులు ఇక్కడ రాత్రి ఎనిమిది గంటల వరకు స్కేటింగ్ ఆడుకుంటారు. చీకటిపడిన తర్వాత కోర్టుకు వెళ్లాలన్నా, రావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలావుంటే, చీకటిపడ్డాక ఈ మార్గంలో ఆకతాయిల అలజడి అధికంగా ఉంటుంది. అక్కడే మద్యం, ధూమపానం వంటివి చేస్తుండడంతో ఈ మార్గంలో వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే ఈ మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు అల్లరిమూక ఆటలు కట్టించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రోడ్డుపై గుంత.. వాహనదారులకు చింత..!

- రెండు నెలల క్రితమే మరమ్మతులు చేపట్టిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- తాజాగా పరవాడ బంగ్లా కూడలి వద్ద రహదారి ధ్వంసంతో అవస్థలు



బంగ్లా కూడలి వద్ద రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

పరవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడలోని బంగ్లా కూడలి వద్ద రహదారి ధ్వంసమైంది. ఈ కారణంగా పెద్ద గుంత ఏర్పడడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలల క్రితమే ఇక్కడ గుంతలను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పూడ్చారు. ఇంతలోనే మళ్లీ గుంత ఏర్పడడంపై స్థానికులు మండిపడుతున్నారు. నాణ్యతా లోపం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపిస్తున్నారు. నిత్యం ఈ కూడలి మీదుగా ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు వెళ్లే కార్మికులతో పాటు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. గుంతను గుర్తించలేని పలువురు వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని అంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి గుంతను పూడ్చేవేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని 11కేవీ నర్సింగబిల్లి సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని డీఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. నర్సింగబిల్లి, జె.తుని, ఎన్.జి.పాలెం, త్రిపురవానిపాలెం, అచ్చుతపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, గొల్లగుంట, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

తేగాడ కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కశింకోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేగాడ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6, 11వ తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ కోరారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ ఏప్రిల్ 11వ తేదీ వరకు ఉంటుందన్నారు. అర్హత కలిగిన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపవుట్స్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశాలకు కేవలం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణిస్తామని వివరించారు. దరఖాస్తును వైబ్ సైట్ https://apkgbv.apcfss.in/ ద్వారా చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందన్నారు.

కలపాకలో మూలకు చేరిన ఆర్‌వో ప్లాంట్



వినియోగంలో లేని ఆర్వో ప్లాంట్

పరవాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కలపాక గ్రామంలో గల ఆర్‌వో ప్లాంట్ మూలకు చేరింది. గ్రామస్థులకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12 లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 1500 మంది వినియోగించుకునేవారు. పంచాయతీ అధికారులకు ఈ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కొన్నేళ్ల పాటు బాగా పనిచేసింది. ఇరవై లీటర్ల క్యాన్ ఐదు రూపాయలకే విక్రయించేవారు. ప్రస్తుతం ఇది మరమ్మతులకు గురై మూలకు చేరినా పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారులు వెంటనే స్పందించి ఆర్‌వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాల్సిందిగా గ్రామస్థులంతా కోరుతున్నారు.

జాబ్‌మేళాలో 338 మంది ఎంపిక



ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీ ప్రతినిధి

నర్సీపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రిషి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. బుధవారం 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ జ్యోతి వెలిగించి జాబ్ మేళాను ప్రారంభించారు. 985 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. 18 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 338 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కోన సతీశ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల చేతిలో శక్తి



శక్తివంతమైన యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

- ఫోన్ షేక్‌చేస్తే.. పోలీసులకు అలెర్ట్ మెసేజ్
- ట్రావెల్ మ్యాప్‌తో నిమిషాల్లో రక్షణ
- యాప్‌లోనే ఫిర్యాదు చేసుకునే అవకాశం
- కుటుంబ కౌన్సెలింగ్ రిక్వెస్ట్ చేసుకునేందుకు సౌలభ్యం
- వాట్సాప్ సేవలు కూడా లభ్యం
- ఐదు మిలియన్లు దాటిన యాప్ డౌన్‌లోడ్లు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

మద్దిలపాలెం క్రాంతినగర్‌కు చెందిన యువతి దొండపర్తిలో తాను పనిచేసే షోరూమ్‌కు వెళ్లడానికి సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కింది. గమ్య స్థానం దగ్గరవుతున్నప్పటికీ డ్రైవర్ ఆటో ఆపకుండా గాజువాక తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. ఏం చేయాలో తెలియక రైల్వే ఆస్పత్రి సమీపంలో ఆటోలోంచి దూకి కిడ్నాప్ నుంచి తప్పించుకుంది. కానీ ఈ ఘటనలో తీవ్రంగా గాయపడింది.

రామ్‌నగర్‌లో నివాసముంటున్న భర్తభార్యలు రాత్రి సినిమా చూసి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు రౌడీషీటర్లు వెంటపడ్డారు. ఇంటిలోపలికి వెళ్లినా వదలకుండా దాడిచేశారు. మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు.

పూర్ణామార్కెట్ రంగిరీజు నివాసులైన దంపతులు, కుమార్తె షాపింగ్ నుంచి ఇంటికి వెళ్తుండగా గంజాయి మత్తులో ఆకతాయిలు వెంబడించారు. వారిపై దాడి చేసి, వివాహిత చీరను చించేశారు. మహిళ సోదరుడు వచ్చి అడ్డుకునే యత్నంలో అతడిని గాయపరిచారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి సంఘటనలు నగరంలో నిత్యకృత్యమవుతున్నాయి. వాటి నుంచి తక్షణ రక్షణ పొందేందుకు అవకాశం లేక బాధితులు బలవుతున్నారు. ఇలాంటి సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టే యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అదే శక్తి యాప్. మహిళ రక్షణకు ఉద్దేశించి రూపొందించిన ఈ యాప్‌కు ఆధునిక సాంకేతికతను జోడించి, అనేక ఫీచర్లను అందుబాటులోకి తీసుకురావడంతో ఇప్పుడు మహిళలు ఎక్కడ ఉన్నా వారి వెంట పోలీసు రక్షణ ఉన్నట్టే. పోలీసు శాఖ ఎన్నో ఫీచర్లతో యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అత్యవసర, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఫోన్ ఊపినా చాలు లోకేషన్‌తో సహా పోలీసులకు అలెర్ట్ మెసేజ్ వెళ్తుంది. మహిళల ఫోన్‌లో శక్తి యాప్ ఉంటే పోలీస్ రక్షణ వెంట ఉన్నట్టే. ఇన్ని ఫీచర్లను పొందుపరచడంతో ఈనెల 6న గూగుల్ ప్లేస్టోర్‌లోకి వచ్చిన యాప్ ఐదు రోజుల్లోనే ఐదు మిలియన్ల కంటే ఎక్కు డౌన్‌లోడ్లు అయ్యాయి.



ట్రాక్ మై ట్రావెల్ క్లిక్

శక్తియాప్ ఇన్‌స్టాల్ చేసుకుని ఫోన్ నంబర్‌తో లాగిన్ అయిన తరువాత ఓటీపీ నమోదు చేస్తే వివరాలు పూరించే ఇంటర్‌ఫేస్ వస్తుంది. అక్కడ పేరు, చిరునామా, ఏరియా పోలీస్‌స్టేషన్ ఎంటర్ చేశాక మరో ఇంటర్‌ఫేస్‌కు వెళ్లి సమాచారం అందించడానికి ఐదుగురు వరకు బంధువుల ఫోన్ నంబర్లు ఎంటర్ చేయడంతో లాగిన్ ప్రక్రియ పూర్తవుతుంది. తర్వాత మహిళలు ప్రయాణం చేసే ముందు యాప్ ఓపెన్ చేసి ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ సెలక్ట్ చేసుకుంటే న్యూ ట్రాక్ రిక్వెస్ట్ వస్తుంది. అందులో ప్రస్తుత లొకేషన్, వెళ్లాల్సిన ప్రాంతం, వాహనం నంబరు నమోదు చేస్తే పోలీస్ కంట్రోల్ రూమ్‌లో మనం ప్రయాణం చేసే వాహనం గూగుల్ మ్యాప్‌లో కనిపిస్తుంది. మనం సెలక్ట్ చేసుకున్న గమ్యస్థానానికి వాహనం వెళ్తోందో లేదో పోలీసులు గమనిస్తారు. వేరే మార్గంలో వెళ్తే వెంటనే అలెర్ట్ చేస్తారు.

ఫోన్ షేక్ చేస్తే అలెర్ట్...

శక్తియాప్‌లో ముఖ్యమైన ఫీచర్ హ్యాండ్ గెస్చర్. యాప్‌లోని పర్సనల్ ఇన్ఫర్మేషన్‌లో ఉండే ఈ ఆప్షన్ ఆన్ చేసిఉంటే ఫోన్ షేక్ చేస్తే చాలు పోలీసులకు అలెర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. కిడ్నాప్ యత్నం సమయాల్లో ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. పోలీస్ అవసరం ఉన్నప్పుడు యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఆప్షన్‌పై వేలితో నొక్కితే 10 సెకన్ల వీడియో, ఆడియో రికార్డై సంఘటన స్థలం లోకేషన్‌తో సహా పోలీస్ కంట్రోల్ రూమ్, లాగిన్‌లో నమోదు చేసుకున్న సన్నిహితుల ఫోన్ నంబర్లకు చేరిపోతుంది. దీంతో బాధితుల పరిస్థితి తెలుసుకుని సమీపంలోని పోలీసులు నిమిషాల్లో ప్రత్యక్షమవుతారు. ప్రమాదకర సమయంలో ఫోన్‌లో యాప్ ఓపెన్ చేసి ఎస్‌వోఎస్ ఆప్షన్ క్లిక్ చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు ఫోన్ ఊపితే చాలు పోలీసులకు అలెర్ట్ వెళ్తుంది. అందుకే ప్రయాణ సమయంలో హ్యాండ్ గెస్చర్ ఆప్షన్ ఆన్‌చేసి ఉంచితే పోలీస్ భద్రతలో ఉన్నట్టే.

యాప్‌లోనే ఫిర్యాదు...

మహిళలు పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండానే శక్తియాప్ ద్వారా ఫిర్యాదు చేసుకునే ఫీచర్ కూడా అందుబాటులోకి తెచ్చారు. యాప్‌లో గివ్ ఏ కంప్లైట్ ఆప్షన్‌లోకి వెళ్లి ఫిర్యాది జిల్లా, ఏరియా పోలీస్‌స్టేషన్ ఎంపిక చేసుకోవాలి. ఫిర్యాదు చేస్తున్న అంశంతో పాటు వివరాలు ఎంటర్ చేయాలి. ఇమేజ్ అప్‌లోడ్ వద్ద క్లిక్ చేసి ఫిర్యాదు రాసిన కాగితాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది బాధితులను సంప్రదించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. సైబర్ నేరాలు, ఫొటో మార్ఫింగ్, కిడ్నాప్, బాల్య వివాహాలు, అత్యాచారం, దాడులు, వేధింపులు తదితర నేరాలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వ్యక్తిగత కుటుంబవ్యవహారాల్లో పోలీస్ కౌన్సిలింగ్ అవసరమనుకుంటే శక్తియాప్ ద్వారా రిక్వెస్ట్ చేసుకోవచ్చు. కుటుంబ తగాదాలు, భార్యాభర్తల మధ్య గొడవలు, గృహహింస వంటి వ్యక్తిగత వ్యవహారాల్లో మహిళలు యాప్ ద్వారా కౌన్సెలింగ్ కోరితే ఏరియా పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది ఇంటికి వచ్చి బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

అందుబాటులో పోలీస్ కాంటాక్ట్స్..

శక్తియాప్‌లో పోలీస్ అధికారుల కాంటాక్ట్ నంబర్లు ఉన్నాయి. జిల్లా పోలీస్ స్టేషన్ ఎంపిక చేసుకుంటే అక్కడ అధికారుల నంబర్లు కనిపిస్తాయి. నివాసముంటున్న ఏరియా ఏ పోలీస్‌స్టేషన్ ఎంతదూరంలో ఉందో తెలుస్తుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాలంటే అక్కడ పరిధి పోలీస్‌స్టేషన్, ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉందో యాప్‌లో కనిపిస్తుంది. అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిల ఆగడాలపైనా ఫిర్యాదు చేయొచ్చు. పోలీస్ సేవలతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలు కూడా శక్తియాప్ ద్వారా పొందే అవకాశం కల్పించారు.

న్యాయ పరిశోధనలో విశాఖ వారసత్వాన్ని కొనసాగించాలి

- ప్రపంచీకరణకు అనుగుణంగా అంతర్జాతీయ లా అవసరం
- గోవా లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆర్. వెంకట్రావు

సబ్బవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ పరిశోధనలో విశాఖపట్నం వారసత్వాన్ని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కొనసాగించాలని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వెంకట్రావు ఆకాంక్షించారు. డీఎస్ఎన్ఎల్‌యూలోని సెంటర్ ఫర్ ఇంటర్నేషన్ లా అండ్ అలైడ్ డిసిప్లిన్స్(సీఐఎల్ఏడీ) ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ చట్టంలో నూతన ధోరణులు- ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ వెంకట్రావు మాట్లాడుతూ, న్యాయ పరిశోధనలో విశాఖ ఒకప్పుడు అగ్రగామిగా ఉండేదని, దానిని డీఎస్ఎన్ఎల్‌యూ కొనసాగిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. న్యాయవాద వృత్తిలో ఎదిగేందుకు ఆకాశమే హద్దుగా అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రపంచీకరణతో ఇంటర్నేషనల్ లా ఎంచుకున్న వారికి కూడా ఇదే అవకాశాలు ఉన్నాయన్నారు. మరో అతిథి, విదేశాంగ మంత్రిత్వ శాఖలో చట్టపరమైన, ఒప్పందాలు విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎడ్ల ఉమాశంకర్.. వివిధ దేశాలతో రకరకాల ఒడంబడికలతో జరిగే ఒప్పందాల తయారీలో ఉద్భవిస్తున్న ధోరణులు అందులో ఉండే అవకాశాలను గురించి వివరించారు. అనంతరం ప్రపంచ న్యాయ సంస్థలలో ఉపాధి మార్గాలు, అంతర్జాతీయ దౌత్యం, మధ్యవర్తిత్వంలో విద్యార్థులు, నిపుణులకు సహాయపడడానికి రూపొందించిన సావనీర్ ను ఆవిష్కరించారు. అంతకు ముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రపంచీకరణతో అంతర్జాతీయ లా ఔచిత్యం పెరిగిందని, అందువల్ల ఇంటర్నేషనల్ లా మీద తర్ఫీదు పొందిన వారికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, సీఐఎల్ఏడీ సెంటర్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ నీలిమ, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమారి, షెర్లీ హెఫ్సిబా, పలు వర్సిటీల నుంచి వచ్చిన విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.



సీఐఎల్ఏడీ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వెంకట్రావు, ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, డాక్టర్ ఎడ్ల ఉమాశంకర్

నూకాంబిక జాతరకు భారీ ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

కోసం స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రోజూ రాత్రిపూట అమ్మవారికి పెద్దఎత్తున హారతి ఇస్తారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్లకు ఆహ్వానం

కొత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి ఉత్సవానికి రావాలంటూ స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం అమరావతిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజులను కలిసి ఆహ్వానించారు. వీరిని శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. ఇదే సమయంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, మండలి బుద్ధప్రసాద్, విష్ణుకుమార్‌రాజు, పితాని సత్యనారాయణ, బ్రహ్మానందరెడ్డి, అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని అందజేసిన కొణతాల రామకృష్ణ

కలెక్టర్ల సదస్సులో ఎన్ఏఓబీ బాధితుల సమస్య

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులు పడుతున్నామని, వీటిని పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్ఏఓబీ చుట్టూ ప్రహరీగోడ నిర్మించి గేట్లు ఏర్పాటు చేయడంతో శారదా నది గుండా సముద్రంలో చేపల వేటకు వెళ్లలేకపోతున్నామని, దీనివల్ల ఉపాధి కోల్పోయామని వాపోయారు. మత్స్యకారులు 150 రోజులపాటు ధర్నా చేయగా వాడనర్సాపురం, కొత్తపట్నంలో కొందరికి జీవనోపాధి ప్యాకేజీ కింద ఒక్కో కుటుంబానికి రూ.1.3 లక్షల చొప్పున అందజేశారని, ఇంకా కొత్తపట్నంలో కొందరికి, కొప్పుగొండుపాలెంలో పలువురు మత్స్యకార కుటుంబాలకు ప్యాకేజీ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ప్యాకేజీ మాత్రం అందలేదని వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో మత్స్యకారుల సమస్యలపై మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో తాను యువగళం పాదయాత్ర చేసిన సందర్భంగా స్థానిక మత్స్యకారులు తమ సమస్యలపై వినపత్రాన్ని అందజేశారని, ఎన్ఏఓబీ అధికారులతో చర్చించి మత్స్యకారుల సమస్యకు పరిష్కారం చూపాలని, వారికి ప్యాకేజీ అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఆదేశించారు.

పేదల కాలనీలో పెద్దోళ్లకు ఇళ్లు!

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో 178 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వేర్వేరు దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకూ రూ.60 లక్షల వరకూ (యూనిట్ వ్యయం రూ.1.8 లక్షలు) బిల్లులు చెల్లించారు. లేఅవుట్‌లో 134 ఇళ్లు మంజూరుచేస్తే 178 ఇళ్లు ఎలా నిర్మిస్తున్నారని అధికారులు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. గత ఏడాది ఎన్నికల తరువాత ప్రభుత్వం మారడంతో వైసీపీ అక్రమాలపై కూటమి పార్టీలకు చెందిన నేతలు, స్థానికులు, గ్రామ సర్పంచ్ తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. రెండు నెలల క్రితం లబ్ధిదారుల అర్హతపై విచారణ చేయాలని ఆదేశించిన ప్రభుత్వం, ఒక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ప్రకారం గ్రామంలో 134 మంది పేర్లను ఆధార్ కార్డు నంబరుతో విచారణ చేపట్టగా 60 మంది అనర్హులు ఉన్నారని తేలింది. వీరిలో పది మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, సైనికులు ఉన్నట్టు గుర్తించారు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. అయితే ఇంతవరకూ అనర్హులపై చర్యలు తీసుకోలేదు.

ఇది రన్‌వే కాదు.. రాంబిల్లి రోడ్డు!

... 5వ పేజీ తరువాయి

గుండా ఎన్ఏవోబీ నిర్మాణపనులకు మెటీరియల్ తరలించే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడి దారుణంగా తయారైంది. ప్రమాదాలు సైతం పెరిగాయి. ప్రయాణ సమయం రెట్టింపు అయ్యింది. గోతుల కారణంగా వాహనాలు పాడైపోతున్నాయి. రహదారిని బాగుచేయాలని నాడు ప్రతిపక్షంలో వున్న టీడీపీ, జనసేనతోపాటు వామపక్షాలు ఆందోళనలు చేశాయి. అధికారులకు వినతిపత్రాలు అందించారు. కానీ ఒక్క గొయ్యి కూడా పూడ్చలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. ప్రభుత్వం నుంచి రూ.15 కోట్లు మంజూరు చేయించారు. తొలుత గోతులను సిమెంట్ మిక్చర్, బండరాళ్లతో కప్పారు. తరువాత తారు లేయర్ వేశారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. వాహనదారులు సుఖంగా ప్రయాణిస్తున్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ మెకానిక్ మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ తెలిపారు. స్థానిక గవరపాలెం కొణతాల చిన్నయ్యగారివీధికి చెందిన కొయిలాడ శ్రీను ఎలక్ట్రికల్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో శ్రీను తుమ్మపాలలో ఒక దాబా వద్ద ఫ్రిజ్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

నక్కపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద ఈ నెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు సీఐ కె.కుమారస్వామి తెలిపారు. ఉద్దండపురానికి చెందిన మేకల రత్నం(51) హైవే జంక్షన్ దాటుతుండగా, తుని నుంచి వేంపాడు వైపు వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

పాయకరావుపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ యువకుడికి టోకరా వేసిన వ్యక్తిపై పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి వివరాలిలా వున్నాయి. పాయకరావుపేటకు చెందిన లగిశెట్టి శ్రీధర్ గతేడాది విశాఖపట్నం సీతంపేటలోని ఓ హాస్టల్‌లో ఉన్న సమయంలో పెదపాటి హేమంత్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను బీఎస్ఎన్ఎల్‌లో జేటీఓగా పనిచేస్తూ నెలకు రూ.54 వేలు జీతం పొందుతున్నానని, బీఎస్ఎన్ఎల్‌లో బ్యాక్‌గ్రౌండ్ జాబ్స్ ఉన్నాయని చెప్పి వీడియోకాల్, వాట్సాప్ చాటింగ్ చేస్తూ నమ్మించాడు. ఉద్యోగానికి రూ.5 లక్షలు అడుగుతున్నారని చెప్పాడు. తాను అంత ఇచ్చుకోలేనని శ్రీధర్ చెప్పడంతో ముందుగా రూ.3 లక్షలు కడితే ప్రాసెస్ స్టార్ట్ అవుతుందని, ఉద్యోగం వచ్చిన తరువాత మిగిలిన రూ.2 లక్షలు కట్టాలని హేమంత్ చెప్పాడు. ఆ మొత్తం కూడా ఇవ్వలేని శ్రీధర్ అనడంతో కనీసం లక్ష రూపాయలు కట్టాలని, మిగిలినది ఉద్యోగం వచ్చిన తరువాత నెలనెలా 10 వేలు ఇవ్వాల్సి ఉంటుందనడంతో లక్ష రూపాయలు హేమంత్ తెలిపిన బ్యాంక్ అకౌంట్‌లో వేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న జాబ్ జాయినింగ్ ఆర్డర్ వస్తుందని, ఇన్సూరెన్స్ కోసం మరో రూ.10 వేలు ఇమ్మంటే ఇచ్చాడు. గడువు దాటి నెల రోజులు గడిచినా జాబ్ జాయినింగ్ లెటర్ రాకపోగా, ఎప్పుడు వస్తుందని అడుగుతుంటే సమాధానం దాటవేస్తున్నాడు. డబ్బులు తిరిగి ఇచ్చేయమని అడిగితే స్పందించడం లేదు. దీంతో బాధితుడు శ్రీధర్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ నడిపిన బాలుడి తండ్రిపై కేసు నమోదు

చోడవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడలో ఈ నెల 22న నిర్లక్ష్యంగా బైక్ నడిపి ఓ ఉపాధ్యాయినితోపాటు, ముగ్గురు విద్యార్థినులను ఢీకొట్టిన ఘటనలో బైక్ నడిపిన బాలుడి తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ అప్పలరాజు తెలిపారు.

చోరీ చేసిన సొత్తును.. తిరిగి ఇంట్లో పడేసిన దొంగలు

చోడవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు పీఎస్‌పేటలో ఈ నెల 25వ తేదీ ఉదయం కొల్లి లక్ష్మి ఇంట్లో చోరీకి గురైన బంగారు వస్తువులను రోజు గడవకముందే చోరులు ఆమె ఇంటిలో పడేసి ఉడాయించారు. కొల్లి లక్ష్మి మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లింది. పనులు ముగించుకుని 11 గంటలకు ఇంటికి చేరింది. అయితే ఇంట్లో ఉన్న మూడు3 తులాల బంగారు పుస్తెల తాడు, రెండున్నర తులాల గొలుసు చోరీకి గురైనట్టు గుర్తించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగకార్తీక్, క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో లక్ష్మి ఇంటి పరిసరాల్లో వెతికారు. ఈ నేపథ్యంలో బంగారం వస్తువులను ఎత్తుకెళ్లిన వ్యక్తులు బుధవారం ఉదయం తిరిగి ఆమె ఇంట్లోనే పడేసి వెళ్లిపోయారు.

29న లోకేశ్ విశాఖ రాక

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఈనెల 29వ తేదీన నగరానికి రానున్నారు. ఆ రోజు రాత్రి పార్టీ కార్యాలయంలో బస చేసి, 30న నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అదేరోజు ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ నడుమ జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

డీఎస్సీ ఉచిత శిక్షణ వెబ్ ఆప్షన్ల గడువు నేటితో ముగింపు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 28లోగా ఫేజ్-2 వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి కె.రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు https//mdfc.apcfss.in వెబ్ పోర్టల్‌లో ఆప్షన్ సేవ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలకు తమ ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాలన్నారు. ఫేజ్-1 వెబ్ ఆప్షన్‌కు ఎడిట్ ఆప్షన్ లేదని ఆమె స్పష్టం చేశారు.

'ది డెక్'లో టాటా ఇన్నోవేషన్ సెంటర్

- 50 వేల చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు
- నెల రోజుల్లో ప్రారంభం
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి

విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఐటీ అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించడానికి ఉద్దేశించిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్' కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయనుంది. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం.. 'ది డెక్'లో ఇందుకోసం 50 వేల చ.అ. విస్తీర్ణంలో రెండు నుంచి మూడు అంతస్థులు కేటాయించనున్నారు. అమరావతిలో కలెక్టర్లతో సీఎం చంద్రబాబునాయుడు బుధవారం నిర్వహించిన సమావేశంలో దీనిపై చర్చ జరిగింది. భవనం సిద్ధంగా ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించడంతో నెల రోజుల్లోనే దానిని ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. రెండు రోజుల క్రితమే స్టార్టప్ పాలసీని ప్రకటించిన ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రధాన కేంద్రం విజయవాడలో ఉంటుందని, దానికి అనుబంధంగా విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, అనంతపురంలలో స్పోక్ సెంటర్లు ఏర్పాటుచేస్తామని వెల్లడించింది.

పారిశ్రామిక హబ్‌గా...

... 5వ పేజీ తరువాయి

అవుతుంది. అనకాపల్లి మండలం కోడూరులో ఇప్పటికే 70 ఎకరాల స్థలాన్ని చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించారు. రాంబిల్లి మండలంలో 2,500 ఎకరాల్లో మినీ పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో పారిశ్రామిక రంగం 6.71 శాతం వృద్ధి సాధించింది. ఉత్పత్తి, ఉత్పాదక రంగాల వృద్ధి 6.57 శాతంగా నమోదైంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేశారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఇక్కడ ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు.

మైనింగ్‌కు అనుమతులు

జిల్లాలో లేటరైట్, గ్రానైట్, మెటల్, తదితర ఖనిజ నిల్వలు అపారంగా ఉన్నాయి. మైనింగ్ పరిశ్రమల్లో ఉత్పత్తిని పెంచడం, కొత్త మైనింగ్ బ్లాక్‌లకు అనుమతులు జారీ వంటివిచేస్తారు. జిల్లాలో 199 పాత ఖనిజ లైసెన్స్‌లను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టనున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	410
విజయనగరం	414
శ్రీకాకుళం	414